TELANGANA RISING
CURE - PURE - RARE

www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి





EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:61 SUNDAY ,JULY 12,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 61 ఆదివారం 12 జూలై 2026 పేజీలు :8 వెల: 4/-





# తెలంగాణలో పెట్టుబడులకు ఎమిరైట్స్ ఆసక్తి

## సీఎం రేవంత్‌రెడ్డితో కీలక చర్చలు

-రేవంత్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మహమ్మద్ సార్ధన్
-రాష్ట్రానికి ఎమిరేట్స్ సేవలను పెంచాలని కోరిన రేవంత్
-రాష్ట్రానికి రెండు కొత్త విమానాశ్రాయాలు వస్తున్నాయని చెప్పిన సీఎం

హంసకలం వార్త : తెలంగాణ ముఖ్యమ ంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా ఎమిరై ట్స్ వైమానిక సంస్థ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సార్ధన్ శనివారం సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పలు **మిగతా2లో**

# కాళేశ్వరంపై హరీశ్‌రావు సూచనల మేరకే ఈటల రాజేందర్ మాట్లాడారు..



## కేసీఆర్ హయాంలోనే మేడిగడ్డ లోపాలు..
## గతంలోనే ఎన్డీఎస్ఏ కమిటీ నివేదిక ఇచ్చింది..

హంసకలం వార్త : కాళేశ్వరం విషయంలో తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నా యని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టాలని బీజేపీ నేతలు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మాజీమంత్రి హరీశ్‌రావు సూచనల మేరకే ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఎంపీ ఈటల అవాస్తవాలు చెప్పారని ధ్వజమెత్తారు. ఎంపీ ఈటల అంటే తమకు గౌరవమేనని తెలిపారు. ఆ వ్యాఖ్యలతో ఈటల తన గౌరవం పోగొట్టుకున్నారని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకే తాము ప్రయత్ని స్తున్నామని అన్నారు. కేసీఆర్ హయా ంలో 2019 జూన్ 21వ **మిగతా2లో**

## వియత్నాం బోటు ప్రమాదం.. 2 తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తం

# రంగారెడ్డి జిల్లా హత్యలపై మంత్రి సీతక్క దిగ్భ్రాంతి

## కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం



-షాబాద్, దైవాలగూడ ప్రాంతాల్లో ఆరుగురిని హత్య చేసిన రాజ్ కుమార్
-తనపై పోక్సో కేసు పెట్టి జైలుకు పంపించారని కక్ష
-బెయిల్ పై బయటకు వచ్చిన వెంటనే హత్యలు చేసిన వైనం

హంసకలం వార్త : రంగారెడ్డి జిల్లా షాబాద్, దైవాలగూడ ప్రాంతాల్లో జరిగిన ఘోర హత్యల ఘటనపై రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాజస్థాన్ పర్యటనలో ఉన్న మంత్రి, ఘటన వివరాలు తెలియగానే సంబంధిత పోలీస్ కమిషనర్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి సమాచారం సేకరించారు. నిందితుడిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని, కేసు దర్యాప్తును **మిగతా2లో**

# గంటల్లోనే చెన్నై, ముంబై.. తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్లు

తెలంగాణ బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అవతరించబోతోందన్న అశ్వినీ వైష్ణవ్
హైదరాబాద్ నుంచి విజయవాడకు గంటలో చేరుకోవచ్చన్న రైల్వే మంత్రి
తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయని వ్యాఖ్య



హంసకలం వార్త :దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టను న్న ఏడు బుల్లెట్ రైళ్లలో, ఏకంగా మూడు రూట్లు తెలంగాణకే దక్కడం విశేషమని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాని మోదీ ప్రత్యేక **మిగతా2లో**



# ఏపీపై తెలంగాణ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఫోకస్..

- ఏపీలో విద్యాసంస్థల విస్తరణకు మల్లారెడ్డి శ్రీకారం
- తిరుపతిలో మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ ఏర్పాటు
- వర్సిటీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి
- తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం కీలక ప్రకటన
- గతేడాది తిరుపతి, విశాఖలో కాలేజీలు కొనుగోలు చేసిన మల్లారెడ్డి

హంసకలం వార్త

తెలంగాణకు చెందిన ప్రముఖ విద్యావేత్త, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి.. ఏపీలో తన విద్యాసంస్థల సామ్రాజ్యాన్ని విస్తరించే దిశగా కీలక అడుగు వేశారు. తిరుపతిలో 'మల్లారెడ్డి డీమ్డ్ యూనివ ర్సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు **2లో**

# సెమీకండక్టర్ రంగంలో మరో మైలురాయికి చేరిన తెలంగాణ..



హైదరాబాద్: సెమీకండక్టర్ రంగంలో తెలంగాణ రాష్ట్రం మరో కీలక ముందడుగు వేసింది. దేశంలోనే తొలి సీఎంపీ (కెమికల్ మెకానికల్ పాలిషింగ్) ప్యాడ్ టెక్నాలజీ హబ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. టీ-వర్క్స్‌లో ఏర్పాటు చేసిన ఈ హబ్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు శనివా రం ప్రారంభించారు. జపాన్‌కు చెందిన తోహో కోకి సంస్థ సాంకేతిక సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చిప్ తయారీ ప్రక్రియలో అత్యంత కీలకమైన సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ ఇకపై హైదరాబాద్‌లో అందుబాటులోకి రావడంతో దేశీయ సెమీకండక్టర్ పరిశ్రమకు ఊతం లభించనుంది. ఈ హబ్ ద్వారా విద్యార్థులు, స్టార్టప్‌లు, **మిగతా2లో**



# రేవంత్ రెడ్డి ఆట మొదలు పెట్టాడు..

హంసకలం వార్త :రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటి నుంచే పక్కా వ్యూహాలతో ముందుకు సాగుతున్నారని, ఆయన తీసుకునే ప్రతి నిర్ణయానికీ తమ పూర్తి మద్దతు ఉంటుందని టీపీసీసీ **మిగతా2లో**

# ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సులు నడపాలనేది ప్రభుత్వ లక్ష్యం



-రాష్ట్ర రోడ్డు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
-తెలంగాణ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల వ్యవధిలోనే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించాం
-ఇప్పటివరకు 11 వేల కోట్ల వరకు ఉచిత బస్ ప్రయాణాలు జరిగాయి

6

# టీజీపీఎస్సీ నుంచి మరో జాబ్ నోటిఫికేషన్..

7 టౌన్‌ప్లానింగ్ పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ ఉద్యోగ ప్రకటన
ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
ఆగస్టు 22 వరకు దరఖాస్తులకు తుది గడువు
అక్టోబరులో రాత పరీక్ష నిర్వహించనున్న కమిషన్

హంసకలం వార్త : తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) తాజాగా మరో ఉద్యోగ ప్రకటనను విడుదల చేసింది. రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగం లో**2లో**

# బొగ్గు గ్యాసిఫికేషన్ రంగంలోకి సింగరేణి..

## భూగర్భ పైలట్ ప్రాజెక్టుకు సన్నాహాలు




హంసకలం వార్త :బొగ్గు వినియోగంలో నూతన సాంకే తికతలను అందిపుచ్చు కునే దిశగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కీలక అడుగులు వేస్తోంది. భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ రంగం లోకి ప్రవేశించేందుకు ఈ సంస్థ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా పైలట్ ప్రాజెక్టును బెల్లంపల్లి డిప్‌సైడ్ బ్లాక్‌లో ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. సింగరేణి అధికారులు రామగుండం, బెల్లంపల్లి ప్రాంతాల్లో ఐదు లోతైన బొగ్గు బ్లాక్‌ల ను గుర్తించారు. ఈ బ్లాక్‌లలో భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్‌కు **2లో**

# కాళేశ్వరంపై హరీశ్‌రావు సూచనల మేరకే ఈటల రాజేందర్ మాట్లాడారు..

కేసీఆర్ హయాంలో 2019 జూన్ 21వ తేదీన కాళేశ్వరం ప్రారంభించారని తెలిపారు.శనివారం సచివాలయంలో మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్ చేశారు. కేసీఆర్ హయాంలోనే మేడిగడ్డ లోపాలు బయటపడ్డాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ప్రారంభించిన 11 నెలల్లోనే లోపాలు బయటపడ్డాయని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణంలో లోపాలు ఉన్నాయని.. 2020 మే 18వ తేదీన ఈఈ రమణారెడ్డి కేసీఆర్ ప్రభుత్వానికి లేఖ రాశారని ప్రస్తావించారు. లోపాలు సవరించాలని అప్పట్లోనే ఇంజినీర్లు సూచించారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యంతో లోపాలు పెరిగి పెద్దవై బ్యారేజ్ కుప్పకూలిందన్నారు. 2022 జులై 14వ తేదీన వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిందని చెప్పారు. ఇప్పటికీ కన్నెపల్లి పంప్‌హౌస్ వినియోగంలోకి రాలేదని తెలిపారు. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ప్రస్తావించారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే ఎన్డీఎస్ఏ కమిటీ ఏర్పాటు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నీటి నిల్వకు అనుకూలం కావని ఎన్డీఎస్ఏ తేల్చిచెప్పిందని అన్నారు. ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, నిర్వహణ లోపాలపై.. గతంలోనే ఎన్డీఎస్ఏ కమిటీ నివేదిక ఇచ్చిందని ప్రస్తావించారు. ప్రాథమిక, తుది నివేదికల్లో ఎన్డీఎస్ఏ అదే విషయం చెప్పిందని అన్నారు. లోపాలు సవరించాలని నిపుణులు చెప్పినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మొదట్లోనే స్పందించకపోవడంతో ఈ సమస్య పెద్దది అయిందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై పదేపదే అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వియత్నాం బోటు ప్రమాదం.. తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తం

వియత్నాం పర్యటనకు వెళ్లిన తెలుగు రాష్ట్రాలకు చెందిన కొందరు పర్యాటకులు అక్కడ బోటు ప్రమాదంలో మరణించారనే సమాచారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వియత్నాంలోని ఫూ క్వాక్ ద్వీపంలో పర్యటనకు వెళ్లిన భారతీయులు బోటు ప్రమాదంలో మరణించారనే సమాచారంపై సీఎం వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. ప్రమాద వివరాలను తెలుసుకోవడంతో పాటు సహాయక చర్యలను ముమ్మరం చేయడంలో కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు వియత్నాంలోని భారతీయ ఎంబసీ కార్యాలయ అధికారులతో సంప్రదిం పులు జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్య మంత్రి ప్రభుత్వ ప్రధాన కార్యద ర్శిని ఆదేశించారు. ఈ ప్రమాదంలో తెలుగు వారు ఉన్నారని ప్రాథమిక సమాచారం అందిన నేపథ్యంలో పూర్తి సమాచారం తీసుకోవాలని సూచించారు. ఈ ఘటనలో క్షతగా త్రులకు అవస రమైన వైద్యం అందించడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాధితులకు ప్రభు త్వం పూర్తిగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా కల్పించారు. బాధితుల కుటుంబాల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నట్లు వివరించారు. 4 హెల్ప్‌లైన్ నంబర్లు విడుదల చేసినట్లు చెప్పుకొచ్చారు. సమాచారం కోసం వెంటనే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని సీఎం రేవం త్‌రెడ్డి సూచించారు.

# సెమీకండక్టర్ రంగంలో మరో మైలురాయికి చేరిన తెలంగాణ

జపాన్‌కు చెందిన తోహో కోకి సంస్థ సాంకేతిక సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చిప్ తయారీ ప్రక్రియలో అత్యంత కీలకమైన సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ ఇకపై హైదరాబాద్‌లో అందుబా టులోకి రావడంతో దేశీయ సెమీకండక్టర్ పరిశ్రమకు ఊతం లభించనుంది. ఈ హబ్ ద్వారా విద్యార్థులు, స్టార్టప్‌లు, పరిశోధకులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణతో పాటు పరిశోధన, ఉత్పత్తి అభివృద్ధికి అవసరమైన సహకారం అందించను న్నారు. ఈ సందర్భంగా వచ్చే 18 నుంచి 24 నెలల్లో దేశీయంగా సీఎంపీ ప్యాడ్ల తయారీని ప్రారంభించడ మే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.సెమీకండక్టర్ తయారీకి అవసరమైన కీలక సాంకేతికతలను తెలంగాణలోనే అభివృద్ధి చేయనున్న ట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని దేశంలోని ప్రముఖ సెమీకండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన చెప్పుకొచ్చారు. జపాన్‌తో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ అత్యాధునిక సెమీకండక్టర్ టెక్నాలజీ అభివృద్ధికి ఈ హబ్ వేదికగా నిలుస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశోధన నుంచి నైపుణ్యాభివృద్ధి, ప్రోటోటైపింగ్, చిప్ తయారీ వరకు సమగ్ర సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌ను నిర్మించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు.

# రంగారెడ్డి జిల్లా హత్యలపై మంత్రి సీతక్క దిగ్భ్రాంతి

నిందితుడిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని, కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని పోలీసు అధికారులను మంత్రి ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితులకు తక్షణం సహాయం అందించాలని, మానసిక-సామాజిక తోడ్పాటు కల్పించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులను సూచించారు. మహిళలు, పిల్లల భద్రతకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, నేరస్థులు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని సీతక్క హెచ్చరించారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు.కేసు వివరాల్లోకి వెళితే... రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడలో జరిగిన దారుణ హత్యల వెనుక పోక్సో కేసు కక్ష ఉందని పోలీసు దర్యాప్తు వెల్లడైంది. నిందితుడు రాజ్‌కుమార్ (28) తనపై పోక్సో కేసు నమోదు చేసి జైలు పంపిన బాలిక, ఆమె తల్లి, నానమ్మను కత్తితో నరికి చంపాడు. అనంతరం తన భార్య సరిత (పార్వతి సరిత), 3 ఏళ్ల కుమార్తె, 2 ఏళ్ల కుమారుడిని కూడా కిరాతకంగా హత్య చేశాడు. ఈ ఘోర ఉదంతంలో మొత్తం ఆరుగురు మృతి చెందారు. గత మే 16న బాలికను వేధించాడని ఆమె తల్లి ఫిర్యాదు చేయగా, పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి మే 26న రాజ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. శుక్రవారం బెయిల్‌పై విడుదలైన వెంటనే ఈ దారుణం చేశాడని పోలీసులు తెలిపారు.

# బొగ్గు గ్యాసిఫికేషన్ రంగంలోకి సింగరేణి..

బొగ్గు వినియోగంలో నూతన సాంకేతికతలను అందిపుచ్చుకునే దిశగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కీలక అడుగులు వేస్తోంది. భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ రంగంలోకి ప్రవేశించేందుకు ఈ సంస్థ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా పైలట్ ప్రాజెక్టును బెల్లంపల్లి డిప్‌సైడ్ బ్లాక్‌లో ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. సింగరేణి అధికారులు రామగుండం, బెల్లంపల్లి ప్రాంతాల్లో ఐదు లోతైన బొగ్గు బ్లాక్‌లను గుర్తించారు. ఈ బ్లాక్‌లలో భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్‌కు అనుకూల పరిస్థితులను పరిశీలించనున్నారు. ముఖ్యంగా భీమారం, చెన్నూరు సౌత్, నైనీ ప్రాంతాల్లో గ్యాసిఫికేషన్ అవకాశాలపై అధ్యయనాలు చేపట్టనున్నారు. కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల అమలు విధానాలను అధ్యయనం చేసేందుకు సింగరేణి ప్రత్యేక బృందం ఇతర ప్రాంతాల్లో పర్యటించనుంది. అలాగే అమ్మోనియం నైట్రేట్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రత్యామ్నాయ అవకాశాలను కూడా పరిశీలించనుంది. ఈ ప్రాజెక్టు అమల్లో కేంద్ర ప్రభుత్వం అందించే వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ వినియోగంపై సింగరేణి దృష్టి సారిస్తోంది. ప్రాజెక్టు సాంకేతికంగా విజయవంతం కావడానికి సీఎంఐఎఫ్ఆర్ శాస్త్రవేత్తల సాంకేతిక సహకారం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

# రేవంత్ రెడ్డి ఆట మొదలు పెట్టాడు..

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటి నుంచే పక్కా వ్యూహాలతో ముందుకు సాగుతున్నారని, ఆయన తీసుకునే ప్రతి నిర్ణయానికీ తమ పూర్తి మద్దతు ఉంటుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. తాను సంగారెడ్డిలో పోటీ చేయనని మాత్రమే అన్నానని, వేరే నియోజకవర్గం నుంచి తప్పుకుంటానని చెప్పలేదని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సంగారెడ్డి స్థానం మహిళలకు కేటాయించినా లేదా జనరల్ స్థానంగా ఉన్నా అక్కడ నుంచి నిర్మలనే అభ్యర్థిగా బరిలో ఉంటారని క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి సూచనలతో ఎమ్మెల్యేలంతా అలెర్ట్ అవుతున్నారని, క్షేత్రస్థాయిలో యాక్టివ్‌గా లేని ప్రజాప్రతినిధులను సీఎం అప్రమత్తం చేస్తున్నారని తెలిపారు. గతంలో కేసీఆర్ మొదటిసారి సీఎం అయినప్పుడు కూడా ఎమ్మెల్యేల పనితీరు బాగాలేదని సర్వేలు వచ్చాయని జగ్గారెడ్డి గుర్తు చేశారు. రాజకీయాల్లో ఎవరూ పర్మినెంట్‌గా తోపులు కాదని, తామే గొప్ప అనుకుంటే నడవదని హితవు పలికారు. రేవంత్ రెడ్డి ఇప్పటికే 117 సీట్లు గెలిపించుకునేలా ప్లాన్ సిద్ధం చేశారని అన్నారు. సీఎం హెచ్చరించిన తర్వాత కూడా తీరు మార్చుకోని ఎమ్మెల్యేలకు రాబోయే ఎన్నికల్లో సీట్లు ఇవ్వాలో లేదో సీఎం, పీసీసీ చీఫ్, రాష్ట్ర ఇంచార్జ్‌లు మాత్రమే నిర్ణయిస్తారని ఆయన తేల్చి చెప్పారు. ఎవరి సర్వేలు వారికి అనుకూలంగా ఉంటాయని, వాటిని చూసి టెన్షన్ పడాల్సిన అవసరం లేదని చెబుతూ, ప్రతిపక్షాలు ఎప్పుడూ అధికార పక్షాన్ని టార్గెట్ చేయడం రాజకీయ నీతిలో భాగమేనని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.

# ఈ నెల 14న తెలంగాణ వ్యాప్తంగా కళాశాలల బంద్ కు పిలుపునిచ్చిన ఏబీవీపీ

**ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విషయంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందన్న ఏబీవీపీ**

**వీటిపై ఆధారపడి 20 లక్షల మంది విద్యార్థులు చదుకుంటున్నారని వెల్లడి**

**ప్రభుత్వం, ప్రైవేట్ కాలేజీలు కలిసి విద్యార్థులను మోసం చేస్తున్నాయని మండిపాటు**




ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై తెలంగాణ ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని ఏబీవీపీ విమర్శించింది. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లలో జరుగుతున్న ఆలస్యాలను నిరసిస్తూ ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బంద్‌కు పిలుపునిస్తున్నట్టు ఏబీవీపీ ప్రకటించింది. వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించిన ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు ఈ ప్రకటన చేశారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి చదువుకుంటున్నారని రాంబాబు తెలిపారు. ప్రభుత్వం సకాలంలో ఫీజు విడుదల చేయకపోవడంతో రూ. 11 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రతి సంవత్సరం 2 లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారని, వేల మంది సర్టిఫికెట్లు తీసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీలు, ప్రభుత్వం కలిసి విద్యార్థులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కేంద్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర నాయకులు మదూరి సందీప్ రావు, జూపల్లి దీపిక, ఆరిపెల్లి సుజిత్, బెల్లం కార్తీక్, వేల్పుల రాజ్‌కుమార్, గుగులోత్ నవీన్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో పెట్టుబడులకు ఎమిరైట్స్ ఆసక్తి..

ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎంతో చర్చించారు. ఎమిరైట్స్ వైమానిక సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సీఎంను మర్యాదపూర్వకంగా ఎమిరైట్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కలిశారు. హైదరాబాద్‌లో ఎమిరైట్స్ A-38 సర్వీసులను ప్రారంభించేందుకు ఈ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుముఖత వ్యక్తం చేశారు. ఎమిరైట్స్ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణలో మరో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో అక్కడ కూడా ఎమిరైట్స్ MRO ఆపరేషన్స్ కొనసాగించాలని సీఎం సూచించారు. విమాన సర్వీసులకు కావాల్సిన అన్నిరకాల సౌకర్యాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్శిటీలో క్రీడాకారులకు శిక్షణ అందించేందుకు స్పాన్సర్‌షిప్‌నకు ముందుకు రావాలని సీఎం కోరారు. ఈ విషయంపై సానుకూలంగా ఎమిరైట్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ స్పందించారు.

# గంటల్లోనే చెన్నై, ముంబై.. తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్లు

ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ వల్లే రాష్ట్రానికి ఈ భారీ ప్రాజెక్టులు వచ్చాయని, రాబోయే రోజుల్లో తెలంగాణ దేశంలోనే ఒక పెద్ద బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అవతరించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ విప్లవాత్మక ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయాలు ఊహించని విధంగా తగ్గిపోతాయన్నారు.ముఖ్యంగా, హైదరాబాద్ నగరవాసులకు ఈ రైళ్లతో ప్రయాణ కష్టాలు పూర్తిగా తీరిపోనున్నాయి. బుల్లెట్ రైలు ఎక్కితే హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం ఒక గంట పది నిమిషాల్లోనే చేరుకోవచ్చని రైల్వే మంత్రి వివరించారు. అలాగే వ్యాపార రాజధాని ముంబైకి రెండు గంటల ఇరవై నిమిషాలు, అటు చెన్నై నగరానికి కేవలం రెండు గంటల్లోనే దూసుకుపోవచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ దేశ రవాణా రంగంలోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు.ఇదే గ్యాప్‌లో ఈ ప్రాజెక్టుల క్రెడిట్ కోసం కొందరు పాకులాడుతున్నారంటూ విపక్షాలపై మంత్రి మండిపడ్డారు. దీని పూర్తి క్రెడిట్ ప్రధాని మోదీకే దక్కుతుందని, గత యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో కేవలం రూ. 800 కోట్లు మాత్రమే ఇస్తే, తమ ప్రభుత్వం ఒక్క తెలంగాణకే ఏకంగా రూ. 5000 కోట్ల రైల్వే నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. ఈ నిధుల వరద వల్లే రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయనిస్పష్టం చేశారు.

# ఏపీపై తెలంగాణ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఫోకస్..

తెలంగాణకు చెందిన ప్రముఖ విద్యావేత్త, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి.. ఏపీలో తన విద్యాసంస్థల సామ్రాజ్యాన్ని విస్తరించే దిశగా కీలక అడుగు వేశారు. తిరుపతిలో 'మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన అధికారికంగా ప్రకటించారు. ఈ వర్సిటీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు లభించాయని తిరుమలలో వెల్లడించారు.నిన్న ఉదయం శ్రీవాణి ట్రస్ట్ దాతగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మల్లారెడ్డి మీడియాతో మాట్లాడారు. గత 35 ఏళ్లుగా విద్యా రంగంలో సేవలు అందిస్తున్నానని, తిరుపతిలో యూనివర్సిటీ స్థాపించాలన్న తన చిరకాల కల నెరవేరిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. 2025లోనే ఈ ఆలోచన చేశానని, శ్రీవారి దయతో ఇప్పుడు అది కార్యరూపం దాల్చిందని తెలిపారు.తెలంగాణలో ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు, డీమ్డ్ యూనివర్సిటీలతో బలమైన నెట్‌వర్క్‌ను నిర్మించుకున్న మల్లారెడ్డి, ఇప్పుడు ఇతర రాష్ట్రాలపైనా దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ఆయన గతేడాది తిరుపతిలో ఒక ఇంజనీరింగ్ కళాశాలను కొనుగోలు చేశారు. అదే ఏడాది నవంబర్‌లో విశాఖపట్నంలోనూ మరో కళాశాలను కొనుగోలు చేసినట్లు గతంలోనే వెల్లడించారు. శ్రీవారి ఆశీస్సులతో దేశవ్యాప్తంగా విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలన్నది తన ఆకాంక్ష అని పేర్కొన్నారు.పాల వ్యాపారంతో జీవితం ప్రారంభించి, విద్యావేత్తగా, రాజకీయ నాయకుడిగా ఉన్నత స్థాయికి ఎదిగిన మల్లారెడ్డి, ఇప్పుడు తన 'మల్లారెడ్డి' బ్రాండ్‌ను ఏపీకి విస్తరిస్తున్నారు. అయితే, గతేడాది కొనుగోలు చేసిన కాలేజీ ప్రాంగణంలోనే ఈ డీమ్డ్ వర్సిటీని అభివృద్ధి చేస్తారా? లేక కొత్త ప్రాంగణాన్ని ఎంచుకుంటారా? అనే దానిపై రానున్న రోజుల్లో స్పష్టత రానుంది.

# టీజీపీఎస్సీ నుంచి మరో జాబ్ నోటిఫికేషన్..

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) తాజాగా మరో ఉద్యోగ ప్రకటనను విడుదల చేసింది. రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగంలో ఖాళీగా ఉన్న 7 టౌన్‌ప్లానింగ్ సహాయకుల (టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్) పోస్టుల భర్తీకి ఈ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కమిషన్ సూచించింది. దరఖాస్తుల సమర్పణకు ఆగస్టు 22వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. మొత్తం 7 పోస్టులలో 2 రాష్ట్రస్థాయి కేడర్‌కు చెందినవి కాగా, మిగిలిన 5 పోస్టులు మల్టీజోనల్ కేడర్ పరిధిలోకి వస్తాయని టీజీపీఎస్సీ వివరించింది.ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బీ.ప్లానింగ్ లేదా బీటెక్ (ప్లానింగ్)లో ఉత్తీర్ణులై ఉండాలి. ఎంపిక ప్రక్రియలో భాగంగా ఈ ఏడాది అక్టోబరులో రాతపరీక్ష నిర్వహించనున్నట్లు కమిషన్ తన ప్రకటనలో స్పష్టం చేసింది. నియామకాలకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక నోటిఫికేషన్‌లో అందుబాటులో ఉంటాయి.

# సంపాదకీయం


## ప్రవాసులకు ప్రమాద ఘంటికలు!

అమెరికాలో హెచ్1బీ వీసాలపై ఉన్నవారికి, గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునే వారికీ రానున్నకాలంలో మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. హెచ్1బీ ప్రాసెసింగ్‌లో అనుసరించాల్సిన నిబంధనల విషయంలో నియామక సంస్థలు చూసీచూడనట్లు పోతుండడం, గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేసేటప్పుడు అడ్డదారులు తొక్కడం.. వంటి వాటిని ట్రంప్ సర్కారు తీవ్రంగా పరిగణిస్తోంది. ఇలాంటి పనుల ద్వారా స్థానిక అమెరికన్లకు దక్కవలసిన ఉద్యోగాలను విదేశాల నుంచి వచ్చిన వారికి కట్టబెడుతున్నారంటూ అధికారులు ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. నిబంధనలను ఉల్లంఘిదంచాయంటూ పలు సంస్థలకు ఇటీవల తాఖీదులు కూడా జారీ చేశారు. 'కష్టించి పనిచేసే అమెరికన్లు పొందగల ఉద్యోగావకాశాలను, సంస్థల మాయాజాలం వల్ల కోల్పోకుండా చూడడమే తమ లక్ష్యం'గా ట్రంప్ సర్కారు ప్రకటించుకుంది. హెచ్1బీ వీసాలు, గ్రీన్‌కార్డ్ పొందడానికి పాటించాల్సిన (PERM-- Program Electronic Review Management) నిబంధనల విషయంలో అధికారులు ఇప్పుడు గట్టిగా దృష్టి సారించారు. అమెరికాలోని కంపెనీలు అత్యున్నత వృత్తి నైపుణ్యాలు కలిగిన విదేశీయులను మూడేళ్ల వ్యవధి కోసం కొన్ని ప్రత్యేక ఉద్యోగాలలోకి నియమించుకోవడానికి హెచ్1బీ వీసా వీలుకల్పిస్తుంది. మూడేళ్ల తర్వాత ఈ ఉద్యోగుల నియామకాలను ఆరేళ్లకు పొడిగించవచ్చు. అయితే, హెచ్1బీ విషయంలో ఆయా సంస్థలు లేబర్ కండిషన్ అప్లికేషన్ (రాజూా)ను బహిరంగంగా ప్రకటించాల్సి ఉంటుంది. దీనిద్వారా హెచ్1బీ ఉద్యోగులకు ఎంత వేతనం చెల్లించాలనుకుంటున్నదీ తమ సంస్థల ప్రాంగణాలలో ఇతర కార్మికులందరికీ తెలిసేలాగా ప్రదర్శించాల్సి ఉంటుంది. అయితే ఉద్యోగుల నియామకం కోసం ఏజెన్సీలను ఆశ్రయించడంలో హెచ్1బీ ప్రోగ్రాం దుర్వినియోగమవుతున్నట్లు ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. తక్కువ వేతనాలు ఇస్తున్నట్లుగా కూడా ప్రభుత్వం పేర్కొంది. ఇక, హెచ్1బీ మీద పనిచేస్తున్న ఉద్యోగులు అమెరికాలో శాశ్వత నివాసార్హత పొందే గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునే సందర్భాలలో, వారిని స్పాన్సర్ చేసే నియామక సంస్థ మరిన్ని నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. ఏ ఉద్యోగాల కోసం అయితే విదేశీయులను తీసుకోబోతున్నారో, వాటి గురించి విస్తృతంగా ప్రచారం చేసి, తద్వారా అర్హత గల అమెరికన్లు ఆ ఉద్యోగంలో చేరడానికి ఇష్టపడడం లేదని, దరఖాస్తు చేయలేదని నిరూపించుకోవాలి. అందుకోసం ప్రధాన పత్రికలలో వరుసగా రెండు ఆదివారాలపాటు ప్రకటన ఇవ్వాలి, పనిస్థలంలో కనీసం 10 రోజులపాటు ఆ ఉద్యోగాల గురించి నోటీస్ బోర్డులో ఉంచాలి. ప్రభుత్వం అనుమతించిన విధానాలలో అనగా జాబ్ మేళాలు, కంపెనీ వెబ్‌సైట్, ట్రేడ్ జర్నల్స్ ద్వారా కూడా ప్రకటించాలి. ఆ తర్వాత కనీసం 30 రోజులపాటు నిరీక్షించి, 'ఆ ఉద్యోగాల కోసం స్థానిక అమెరికన్లు రావడం లేదు' అని స్పష్టంగా రుజువుచేయాల్సి ఉంటుంది. ఆ తరువాత మాత్రమే లేబర్ సర్టిఫికేషన్ అప్లికేషన్ (LCA) ద్వారా గ్రీన్‌కార్డు కోసం ప్రభుత్వాన్ని సంప్రదించాలి. అయితే, అనేక కంపెనీలు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని, అంతగా ఆదరణలేని పత్రికలలో నామమాత్రంగా ప్రకటనలు వేసి వాటితో ఎల్‌సీఏలకు దరఖాస్తు చేయడం, నిబంధనల అమలులో అడ్డదారులు వెతుక్కోవడం వంటివి చేస్తున్నారని ట్రంప్ ప్రభుత్వం ఆరోపణ. ఈ వ్యవహారాలన్నింటిపై ఇప్పుడు సమగ్ర దర్యాప్తు చేయబోతున్నారు. హెచ్1బీ లేదా గ్రీన్‌కార్డులు పొందడంలో ఇలాంటి వ్యవహారాలను తీవ్రంగా పరిగణిస్తున్న ట్రంప్ ప్రభుత్వం, వాటిని దేశభద్రతతో ముడిపెట్టడానికి సైతం ప్రయత్నిస్తోంది. ఈ అవకతవకలు దేశంలో హింస పెచ్చరిల్లడానికి కారణం అవుతున్నాయని, ఈ వీసా ప్రక్రియల ఉల్లంఘనలు మానవ అక్రమ రవాణాకు దారితీస్తున్నాయని, విదేశాల నుంచి ఉద్యోగాల పేరుతో వస్తున్నవాళ్లు కార్టెల్స్, మాఫియా ముఠాలలో భాగస్వాములు అవుతున్నారని దాని ఆరోపణ. ఈ వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తు అనేది అమెరికాను తిరిగి సురక్షిత దేశంగా తయారు చేయడానికి ఉద్దేశించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే డజన్లకొద్దీ సంస్థలకు తాఖీదులు పంపినట్లుగా లేబర్ డిపార్ట్మెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ప్రకటించారు. నోటీసులు అందుకున్న వాటిలో కాగ్నిజెంట్, విరాట్ సొల్యూషన్స్, ఓక్ టెక్నాలజీస్, గౌరా టెక్ వంటి అనేక సంస్థలున్నాయి. 'ఇలా అక్రమంగా ఉద్యోగాలు పొందుతున్నవారు వైద్య సంస్థలు, వైద్యుల ఆఫీసులలో కీలక స్థానాలలో ఉంటూ అమెరికన్ సమాజానికి ప్రమాదకరంగా తయారవుతున్నార'ని ఆయన ఆరోపణ. సంస్థలు నిబంధనలను ఉల్లంఘించకపోయినా, ఉన్న లొసుగులను కొంత వాడుకుంటున్నాయనేది వాస్తవం. ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తే.. మొత్తంగా అమెరికన్ జాబ్ మార్కెట్ కుప్పకూలే ప్రమాదం ఉంటుంది. వీసా కావాలంటే భారీ రుసుము చెల్లించి తీరాలన్న ట్రంప్ ప్రభుత్వం నిబంధన కోర్టులో చెల్లకుండాపోయింది. ఆ అసహనంతోనే ఇతర దేశాల నుంచి వచ్చి అమెరికాలో పనిచేస్తున్న ఉద్యోగులపై ట్రంప్ సర్కారు కక్షగట్టినట్లుగా వ్యవహరిస్తోందనుకోవాలి. 'అమెరికా ఫస్ట్' నినాదమూ, ఇక్కడి ఉద్యోగాలన్నీ స్థానిక అమెరికన్లకే దక్కాలన్న వాదనా కలగలసి ఈ దర్యాప్తుల రూపం దాల్చాయి. సర్కారు చెబుతున్న కారణాల్లో కొన్ని భిన్నమైనవీ ఉన్నాయి. ఈ ముసుగులో వేతన చోరీ జరుగుతోందనేది ప్రధాన ఆరోపణ. ప్రాజెక్టుల మధ్యలో ఉండే విరామ కాలానికి హెచ్1బీ ఉద్యోగులకు వేతనాలు చెల్లించకుండా కూర్చోబెడుతూ 'అన్‌పెయిడ్ బెంచింగ్' చేస్తున్నారని కూడా ఆరోపిస్తున్నారు. హెచ్1బీ ప్రాసెసింగ్ ఫీజులు చెల్లించడం కోసం, ఉద్యోగుల నుంచి సెక్యూరిటీ డిపాజిట్ల వంటివి డిమాండ్ చేసే అక్రమాలు కూడా జరుగుతున్నాయట. థర్డ్ పార్టీ ప్లేస్‌మెంట్ ఏజన్సీల ద్వారా కంపెనీలు హెచ్1బీ ఉద్యోగులను తీసుకుంటున్నందువల్ల ఉద్యోగి--సంస్థ మధ్య ఉండాల్సిన బంధాన్ని కూడా స్పష్టంగా పాటించడం లేదని సర్కారు అంటోంది. ఈ వ్యవహారాలన్నింటిపై నిశిత పరిశీలన జరిగి, లోపాలు బయటపడితే ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయాలు ప్లేస్‌మెంట్ కంపెనీల మనుగడపై ప్రభావం చూపించే అవకాశం ఉంది. ట్రంప్ సర్కారు అనుసరిస్తున్న దర్యాప్తు విధానాలను బట్టి, హెచ్1బీ వీసాలు, ఆ కాలపరిమితి మేర ఉద్యోగ నియమకాలు పొందేవారికి పెద్ద ప్రమాదం ఉండకపోవచ్చు. కానీ, గ్రీన్‌కార్డు కూడా పొందాలని అనుకునేవారికి మాత్రం చిక్కులు తప్పకపోవచ్చు.

# ఇంటా బయటా పితృస్వామ్య బంధనాలే!







'చైతన్య స్రవంతి' కథన పద్ధతికి పథ నిర్దేశంచేసిన ఆంగ్ల రచయిత్రి వర్జీనియా వూల్ఫ్ 1929లో కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో విద్యార్థినుల నుద్దేశించి ఒక సుప్రసిద్ధ ప్రసంగాన్ని వెలువరించారు. సాహిత్య ప్రపంచం ఇప్పటికీ ఉటంకించే ఆ ప్రసంగంలో ఆంగ్ల సాహిత్య చరిత్రలో పురుష రచయితల ప్రాబల్యాన్ని గురించి ఆమె ప్రధానంగా ప్రస్తావించారు. పురుష రచయితల ప్రాముఖ్యానికి కారణం జెండర్ వివక్షేనని అభిప్రాయపడ్డారు. సమాజ నిర్మాణం, స్వభావరీతుల్లో ఆ వివక్ష అంతర్లీనంగా ఉందని ఆమె పేర్కొన్నారు. పురుష రచయితల సాహిత్య సృజనలు వర్ధిల్లుతున్న విధంగా మహిళలు సృష్టించే సాహిత్య కృతులు సువిఖ్యాతమవ్వాలంటే రచయిత్రులకు రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని వాదించారు. 'ఒక మహిళకు ధనరాశులు, సాహిత్య సృజనకు ఆమెకు ఒక సొంత గది ఉండితీరాలని' వర్జీనియా వూల్ఫ్ సుప్రసిద్ధంగా ఉద్ఘాటించారు. ఆర్థిక భద్రత, సామాజిక హోదా ఉన్న ఉన్నత వంశ సంజాతురాలు వర్జీనియా. వాటితో పాటు తనకున్న అద్భుత అనుకూలతల గురించి ఆమె చెప్పలేదు. తనను ప్రగాఢంగా ప్రేమించే లియోనార్డ్ వూల్ఫ్ ఆమెకు 'దైవమిచ్చిన భర్త'. తన భార్య తనకంటే అనంతంగా ప్రతిభావంతురాలు అని గుర్తించి ఆమె సృజనాత్మక సామర్థ్యాలు సమగ్రంగా వికసించేందుకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించిన వివేకశీలి లియోనార్డ్ వూల్ఫ్. అయితే వర్జీనియాను బైపోలార్ డిప్రెషన్ (తీవ్రమైన, నిరాశాజనకమైన మానసిక స్థితి) నుంచి విముక్తం చేయడంలో ఆ ఉదార హృదయుడు విఫలమయ్యాడు. పట్టి పీడిస్తున్న ఆ మానసిక వ్యాధి మూలంగా వర్జీనియా 1941లో ఆత్మహత్య చేసుకున్నారు. తన భర్తకు వదిలివెళ్లిన వీడ్కోలు సందేశంలో వర్జీనియా ఇలా రాశారు: 'నా విషయంలో మీరు ఓర్పు చూపారు. నన్ను అపురూపంగా చూసుకున్నారు. ఒక భర్తగా, తోటి మనిషిగా మీరు చేయగలిగిన దాని కంటే అత్యుత్తమంగా ప్రతి విషయంలోనూ వ్యవహరించారు. నా ఆశలన్నీ హరించుకుపోయాయి, నా మనసు శూన్యమైపోయింది. అయితే మీ మంచితనాన్ని విస్మరించలేను. మీరు ఎంత ఉత్తమ స్వభావులు అనే విషయంలో నాకు ఇప్పటికీ పరిపూర్ణ నమ్మకం ఉన్నది'. హిందీ రచయిత్రి మన్ను భండారి స్వీయ చరిత్ర 'ఏక్ కహానీ యే భీ' ఆంగ్లానువాదం 'దిస్ టూ ఈజ్ ఏ స్టోరీ' (ఇది కూడా ఒక కథే)ను చదివినప్పుడు వర్జీనియా వూల్ఫ్ అంతిమ మాటలు, లియోనార్డ్‌తో ఆమె వైవాహిక జీవితమూ గుర్తుకువచ్చాయి. మన్ను తండ్రి విద్వజ్జుడు, తల్లి ఉత్తమ గృహిణి. తనకు హిందీ సాహిత్యాన్ని బోధించిన షీలా అగర్వాల్ చదవడానికి పుస్తకాలు ఇచ్చి, ఆ తరువాత వాటి గురించి తనతో చర్చించేవారని మన్ను రాశారు. ఆమె గురించి ఇంకా ఇలా రాశారు: 'షీలాజీ నాకు ధైర్యాన్నిచ్చారు, నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. జీవితంలో ఒక దిశానిర్దేశం చేశారు. నా జీవితానికొక అర్థాన్ని కల్పించారు'. మన్ను భండారి తన స్వీయచరిత్రలో సాహిత్య జీవితం గురించి విశేష శ్రద్ధాసక్తులతో రాశారు. తాను రాసిన నవలలు, కథలు; రచనా శైలులు, రచయితల కలహాలు, విరోధాలు; రచయితల బృందాలు, ముఠాలు వాటి వైనాలు; సాహిత్య జీవితంలో దార్శనిక సంపాదకుల, సాహిత్య పత్రికల పాత్ర తదితర అంశాలను వివరంగా ప్రస్తావించారు. 'మై హర్ గయా' (నేను ఓడిపోయాను) అన్న తన తొలి కథ ఒక పత్రికలో ప్రచురితమయినప్పుడు తాను ఎంతగానో పులకించిపోయానని మన్ను రాశారు. అటువంటి పులకింపు మరెప్పుడూ జీవితంలో ఎన్నో ముఖ్యమైన సంఘటనల సందర్భాలలో కూడా తనకు కలగలేదని మన్ను గుర్తు చేసుకున్నారు. మన్ను స్వీయచరిత్రలో కొన్ని భాగాలు సాహిత్య, సాహిత్య చరిత్ర విద్యార్థులకు విశేష ఆసక్తి కలిగిస్తాయి. ఇతర భాగాలు ముఖ్యంగా తన వైవాహిక జీవితం గురించిన ఆమె కథనాలు విస్తృతంగా ఆసక్తికరమైనవి. భారతీయ పితృస్వామ్య వ్యవస్థపై ఆమె నిర్మొహమాటంగా వెలుగులు ప్రసరించారు. కలకత్తాలో ఉన్నప్పుడు మన్నుకు సాహిత్య ప్రతిభాశాలి రాజేంద్ర యాదవ్‌తో పరిచయమయింది. ఆ పరిచయం ప్రేమగా పరిణమించింది. ఆ ప్రేమ వివాహంగా రూపుదాల్చింది. భార్యాభర్తలు అయిన కొద్ది కాలానికే ఇరువురమూ ఇక నుంచి సమాంతర జీవితాలు గడుపుదామని రాజేంద్ర ఆమెకు స్పష్టం చేశాడు. 'ఒకే ఇంటిలో ఉంటున్నప్పటికీ మనం మన సొంత బతుకులు బతుకుదాం.. ఒకరి జీవితంలో మరొకరు జోక్యం చేసుకోకుండా స్వతంత్రంగా, స్వేచ్ఛగా వేర్వేరుగా జీవిద్దాం అని రాజేంద్ర నిర్దేశించాడు. మన్ను నుంచి వీలైనంత ఎక్కువ సమయం తన పురుష స్నేహితులతో ఉబుసుపోక కబుర్లు చెప్పుకునేందుకు లేదా ఇతర మహిళలతో ప్రేమాయణాలు సాగించేందుకే రాజేంద్ర ప్రాధాన్యమిచ్చేవాడు. మన్నుతో వైవాహిక బంధం తెగిపోయే వరకు రాజేంద్ర అనేకానేక ప్రేమాయణాలలో కొనసాగాడు. తన సంసార జీవితం రాజేంద్ర అబద్ధాలు, వంచనలతో గడిచిందని మన్ను రాశారు. కలకత్తాలో పదేళ్ల కాపురం అనంతరం ఇరువురూ హిందీ సాహిత్య జగత్తుకు కేంద్రమైన ఢిల్లీకి మారారు. ఢిల్లీ జీవితంలోనే ఇరువురూ తమ సుప్రసిద్ధమైన కథలు, నవలలు రాశారు. ప్రముఖ సాహిత్య పత్రిక 'హాన్స్'కు రాజేంద్ర ఎడిటర్ అయిన తరువాత యువ రచయితలు, రచయిత్రులు సదా ఆయన చుట్టూ పరివేష్ఠితమై ఉండేవారు. సాహిత్య సమాలోచనలతో మునిగి తేలుతుండేవారు. అయితే వారెప్పుడూ మన్నుకు ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్ని ఇవ్వలేదు. ఆమె ఇవ్వగలిగేది ప్రేమాభిమానాలు మాత్రమే కదా. ఇది ఆమెకు పెద్దగా మనస్తాపం కలిగించకపోయినప్పటికీ రాజేంద్ర కుటుంబ బాధ్యతలను నిర్లక్ష్యం చేయడం ఆమెను బాగా చికాకుపరిచేది. తాను అనారోగ్యం పాలయినప్పుడు, చివరకు తమ బిడ్డ ఆరోగ్యంగా లేనప్పుడు సైతం రాజేంద్ర తమను ఏ మాత్రం పట్టించుకునేవాడు కాదని మన్ను రాశారు. ఆ రోజుల గురించి ఆమె ఇంకా ఇలా గుర్తుచేసుకున్నారు: 'మా సంబంధాలు ఉద్రిక్తతతో నిండిపోయి ఉండేవి. అనుక్షణం బాధాకరంగానూ అంతులేని వేదన కలిగించేవిగానూ ఉండేవి. అయితే భావోద్వేగ ఒత్తిళ్లను కప్పిపుచ్చుకునేలా మా దైనందిన జీవితం కొనసాగింది. ఒక రచయిత్రిగా తనకు రాజేంద్ర ప్రేరణనిచ్చేవాడని, సాహిత్య వ్యాసంగాలలో ప్రోత్సహించేవాడని మన్ను అంగీకరించారు. యువ రచయితలతోను, తలపండిన రచయితలతోను అతడి సాహిత్య సమాలోచనలు తనకు ఉత్తేజకరంగా, జ్ఞానదాయకంగా ఉండేవని ఆమె అన్నారు. తన నవలలకు, అనేక కథలకు పేర్లు పెట్టింది రాజేంద్రేనని ఆమె పేర్కొన్నారు. అయినప్పటికీ రాజేంద్ర ప్రతికూల వైఖరులకు, దాడులు, దుర్భాషలకు తాను తరచూ గురవుతుండేదానినని ఆమె రాశారు. రాజేంద్ర ప్రవర్తన తనను ఎంతో బాధించిందని, తన రచనా వ్యాసంగానికి కూడా నష్టం చేసిందని, సాహిత్య సృజనా సామర్థ్యంలో తన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసిందని మన్ను భండారి బాధాకరంగా గుర్తు చేసుకున్నారు. 'రాజేంద్ర తనను తాను ఆధునిక ఆలోచనాపరుడుగా, వ్యక్తిగా, రచయితగా ఒక ప్రత్యేకత ఉన్న మనిషిగా భావించుకుంటాడు. అయితే సంసార జీవితంలో భార్య పాత్ర గురించి ఆయన భావాలు విచిత్రమైనవి. జీవిత భాగస్వామి గురించి రచయిత రాజేంద్రకు అటువంటి అభిప్రాయాలు ఉండడం తెలిస్తే అతడి పాఠకులు తప్పక ఉలిక్కిపడతారు. రాజేంద్ర దృష్టిలో భార్య ఒక నర్సులా ఉండాలి. పతి సేవే పరమ ధ్యేయంగా సదా వ్యవహరించాలి. అదీ, ఎటువంటి ప్రతిఫలాలు ఆశించకుండా భర్తకు సేవ చేయాలి. సేవా పరాయణురాలిగా, అదే సమయంలో స్వార్థ రహితురాలిగా ఉండడమే భార్య అనే మహిళ కర్తవ్యం అని అతడు భావించేవాడు అని మన్ను తిరస్కారపూరిత వైఖరితో రాశారు. తమ రచనా వ్యాసంగాలు, వాటి ఆధారంగా పేరు ప్రతిష్ఠలు సముపార్జించుకోవడానికే ప్రాధాన్యమిస్తూ కుటుంబ బాధ్యతలను పట్టించుకోని, ముఖ్యంగా భార్య అస్తిత్వాన్ని గౌరవించని రచయితల గురించి ఆమె ఇలా గర్హించారు: 'షష్టిపూర్తి చేసుకున్న తరువాతే ఈ రచయితలకు జ్ఞానోదయం కలుగుతుంది. అప్పటివరకు తాము నిర్లక్ష్యం చేసిన భార్యలు వారి జీవితాలలో హఠాత్తుగా అత్యావశ్యకమైన మనుషులు అవుతారు!' త్యాగశీలి, అనురాగశీలి అయిన మహిళకు స్వతస్సిద్ధంగా ఉండే సహన స్వభావంతో మన్ను చాలాకాలం వ్యవహరించారు. అయితే రాజేంద్ర తీరు ఆమె సహనానికి ఒక నిత్య పరీక్ష అయిపోయింది. ఓర్పు ఇంకెంత మాత్రం వివేకం కాదని విశ్వసించక తప్పని పరిస్థితి ఏర్పడింది. రాజేంద్ర నుంచి విడిపోవాలనే నిర్ణయానికి మన్ను వచ్చారు. చాలాసార్లు ఆమె ఆ నిర్ణయానికి వచ్చారు. బిడ్డ భవిష్యత్తు గురించి ఆలోచించారు. దాంతో పాటు తాను ఒక బుద్ధిమంతుడిగా వ్యవహరిస్తానని రాజేంద్ర అనేకమార్లు వాగ్దానాలు చేశాడు. ఎన్నిసార్లు వాగ్దానం చేశాడో అన్నిసార్లూ అతడు వాగ్దాన భంగానికి పాల్పడ్డాడు. అతడిలో మార్పురాదని తేలిపోయింది. ముప్పై ఏళ్ల వైవాహిక జీవితం అనంతరం రాజేంద్రతో జీవితం అర్థరహితమనే దృఢ నిర్ణయానికి మన్ను అంతిమంగా వచ్చారు, విడిపోయారు. మన్ను తన నుంచి విడిపోవాలని నిర్ణయించుకున్నారన్న విషయాన్ని రాజేంద్రకు చెప్పినప్పుడు అతడు దిగ్భ్రాంతి చెందాడు. నమ్మలేకపోయాడు. ఆగ్రహించాడు. మన్నుతో సంసార జీవితం ముగిసిన కథ అని అతడు అంగీకరించక తప్పలేదు. రాజేంద్ర ప్రతిస్పందనల గురించి మన్ను తిరస్కార భావంతో ఇలా రాశారు: 'భార్యలను ఇంటి నుంచి గెంటివేయడం పురుషులకు బాగా తెలుసు. విడిపోవాలని ఉమ్మడిగా నిర్ణయం తీసుకోవడం గురించి కూడా వారికి తెలుసు. అయితే భార్య తన సొంతంగా విడిపోయేందుకు నిర్ణయం తీసుకోవడం, ఎటువంటి అభ్యంతరాలు చెప్పకుండా, చిక్కులు కల్పించకుండా భర్త ఆ నిర్ణయాన్ని అంగీకరించడమనేది చాలావరకు జరగని పని. మహిళా సమానత్వం గురించి విశ్వసించే, మహిళలకు అన్నింటా సమ హక్కులు కల్పించాలని వాదించే పురుషులు సైతం భార్య స్వయంగా విడిపోయేందుకు నిర్ణయం తీసుకోవడాన్ని ఆమోదించలేరు, హర్షించలేరు. ఇదొక కఠోర వాస్తవం'. ఆనందప్రదమైన వైవాహిక జీవితం విషయంలో మన్ను భండారీ కంటే వర్జీనియా వూల్ఫ్ మహా అదృష్టవంతురాలు, ఇతర మహిళా సాహితీవేత్తల కంటే కూడా ఆమె గొప్ప అదృష్టవంతురాలు. భారత్‌లోనూ, సకల సమాజాలలోనూ భర్తలు లియోనార్డ్ వూల్ఫ్ లాంటి పురుషులు అయితే మన ప్రపంచం, మరింత మహోన్నత సాహిత్యంతో మహా ఆనందధామంగా విలసిల్లుతుంది.

# ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్ కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా భాగస్వామి కావాలని కోరారు.

( జూలై - 11- హంసకలం వార్త )

శంషిగూడ డివిజన్ పరిధిలోని శాతవాహన నగర్ కాలనీలో జరుగుతున్న సర్ ఓటు మ్యాపింగ్ కార్యక్రమాన్ని డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ స్థానిక నాయకులతో కలిసి పరివేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్ కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా భాగస్వామి కావాలని కోరారు. బిఎల్ఓలు అందజేసే ఎమ్యూనరేషన్ ఫారంలో తమ పూర్తి వివరాలను సక్రమంగా నమోదు చేసి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు, బూతు లెవెల్ అధికారులు సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న ఓట్లను గుర్తించి





తొలగించేందుకు బిఎల్ఓలు కృషి చేయాలని, నకిలీ ఓట్లను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదు కావడం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, కాలనీ ప్రెసిడెంట్ పి.రత్న ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎమ్.బాబురావు, ప్రధాన కార్యదర్శి ఎమ్.యాదిరెడ్డి, కె.వెంకటరావు, ఎస్.రామనాధము, కె.రామకోటేశ్వర రావు, ఎస్. హనుమంత రాజు, వి.రామ మోహన్ రావు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నంలో ప్రైవేట్ ఆస్పత్రుల చికిత్సకు మరో నిండు ప్రాణం బలి

( జూలై - 11- హంస కలంవార్త )

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని మంచాల్ రోడ్డు వద్దగల సాన్వి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స వికటించి చింతల గ్రామానికి చెందిన సామర్తి నరసింహ (50) అనే వ్యక్తి మృతి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కొద్దిగా ఆరోగ్యం బాగా లేకపోవడంతో మంచిగా ఆసుపత్రికి నడుచుకుంటూ వచ్చి... సాన్వి ఆస్పత్రికి చికిత్స కోసం రాగా ఎన్నో రకాల వైద్య పరీక్షలు చేసి ఏవో ఇంజక్షన్లు ఇచ్చి పరిస్థితి విషమించింది అని తెలుసుకొని సిటీ పోవాలని చెప్పడంతో కిలోమీటర్ పరిధిలో ఉన్న ఇంకో ప్రైవేట్ హాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించడని తెలపడంతో తాము కంగు తిన్నమని,కావాలనే వేరే ఆసుపత్రికి పంపారని బంధువులు ఆరోపిస్తున్నారు. న్వి ఆస్పత్రి ముందు తీవ్ర ఆందోళన చేస్తున్న బంధువులు... అర్హులైన డాక్టర్ల చేత వైద్యం చేయించకనే వచ్చిరాని వైద్యం చేసి... ఫోన్లో మాట్లాడుతూ వైద్యం చేసి ఒక నిండు ప్రాణం బలికొన్నారని కుటుంబ సభ్యుల ఆవేదన.... ఇటువంటి ఆస్పత్రులపై వైద్య ఆరోగ్యశాఖ తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు..




## తెలుగు యూనివర్సిటీ విద్యార్థులు సేవ్ నాంపల్లి క్యాంపస్ అంటూ పదో రోజు వినూత్నంగా నిరసన

**-10వ రోజు ఉద్యమం ఉధృతం.**

( జూలై - 11- హంస కలంవార్త )

హైదరాబాద్ ప్రైవేటు వ్యక్తుల బారి నుంచి తెలుగు యూనివర్సిటీ నాంపల్లి క్యాంపస్ ను కాపాడుకునేందుకు విద్యార్థుల ప్రారంభించిన నిరసన పది రోజులు దాటిన ఉధృతి తగ్గలేదు. శనివారం రోజు సెలవు రోజు అయినప్పటికీ జర్నలిజం విభాగం విద్యార్థులు, భాషా శాస్త్ర, జ్యోతిష్యం విభాగం, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది అధిక సంఖ్యలో దీక్షలో కూర్చున్నారు. సేవ్ నాంపల్లి క్యాంపస్ అంటూ నినాదాలు హోరెత్తించారు. తెలుగు యూనివర్సిటీ జోలికి వస్తే ఖబర్దార్ హెచ్చరించారు. విద్యార్థులు గల మెత్తితే.. కబ్జాదారులే పారిపోరా అంటూ జర్నలిజం విద్యార్థులు పాటలు పాడుతూ, వార్తలు చదువుతూ, కవితల రూపంలోనూ తమ నిరసన తెలిపారు. స్టూడియో రూపంలో ఓ సెట్ ను అక్కడే వేసి ఆకట్టుకున్నారు. శనివారం రోజు ముఖ్యంశాలు అంటూ తెలుగు యూనివర్సిటీలో జరుగుతున్న ఉద్యమాలను తెలియజేశారు. సేవ్ నాంపల్లి క్యాంపస్ అంటూ నినదించారు. ఈ సందర్భంగా సీనియర్ అధ్యాపకురాలు, తెలుగు వర్సిటీతో రెండు దశాబ్దాలకు పైగా అనుబంధం ఉన్న డాక్టర్ షేక్ హసీనా మాట్లాడుతూ.. తమ యూనివర్సిటీ కాపాడుకోవడానికి విద్యార్థులు చేస్తున్న ఈ ఉద్యమానికి అందరూ మద్దతు పలకాలి అన్నారు. తెలుగు యూనివర్సిటీ సకల కళలకు, వినూత్న కోర్సులకు నిలయమని చెప్పారు. ఇటువంటి యూనివర్సిటీకి బాచుపల్లి, నాంపల్లి క్యాంపస్ లే కాదు.. ఇంకో క్యాంపస్ ఏర్పాటు చేసినా తక్కువే అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ ఆవేదనను ఆందోళనను అర్థం చేసుకొని సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. సరస్వతీ దేవాలయాన్ని, ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం సరికాదన్నారు. ఇదే యూనివర్సిటీలో విద్యార్థులకు పాఠాలు నేర్పిన జయదీర్ తిరుమలరావు



కూడా విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకోవాలని కోరారు. ఆద్య కళ అంటే తమకు గౌరవమేనని, దానికి మేం వ్యతిరేకం కాదు కానీ, దయచేసి యూనివర్సిటీ జోలికి రావద్దని విన్నవించారు. తెలుగు యూనివర్సిటీ పరిరక్షణ సమితి భార్యలో జరిగిన ఈ కార్యక్రమంలో జర్నలిజం, భాష శాస్త్ర, జ్యోతిష్య విభాగం అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, పీహెచ్డీ స్కాలర్లు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.ం

# కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుకు"

( జూలై - 11- హంస కలంవార్త )

ఎంపికైన ప్రముఖ రంగస్థల నటులు, బహుముఖ ప్రజ్ఞాశాలి గుమ్మడి గోపాలకృష్ణ ని యూసుఫ్ గూడ లోని వారి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శు భాకాంక్షలు తెలపడం జరిగింది. గుమ్మడి గోపాలకృష్ణ అమోఘమైన నటనా ప్రతిభను గుర్తించి ఒక రంగస్థల నటుడికి మొదటిసారిగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు ప్రకటించడం తెలుగు వారందరికీ గర్వకారణం గా భావిస్తూ, తెలుగు రంగస్థల వైభవంకు జాతీయస్థాయిలో లభించిన గుర్తింపు, ప్రోత్సా హకంగా భావిం చడమైనది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గా సేవలందిస్తున్న గుమ్మడి గోపాలకృష్ణ ని ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ డ్రిస్టిబ్యూటర్ పోలవరపు సుభాష్ చంద్రబోస్ , తెలుగు యూనివర్సిటీ కి చెందిన రత్నాల మురళి శాలువాతో సత్కరించారు.వేజండ్ల కిషోర్ బాబు జుఇ. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పెద్దపల్లి పార్లమెంట్ పరిశీలకులు. తెలుగుదేశం పార్టీ, తెలంగాణ. (కూక ట్ పల్లి నియోజకవర్గం)



## శ్రీ రంగనాయక స్వామి వారి సేవలో పాల్గొన్న రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

( జూలై - 11- హంస కలంవార్త )

కూకట్‌పల్లి లోని శ్రీ రంగనాయక స్వామి దేవస్థానంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజ మహోత్సవం మరియు అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని,స్వామి వారి భక్తులు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు.అనంతరం ఆలయంలో నిర్వ హించిన అన్న సమారాధన (అన్నదాన) కార్య్ర కమంలో పాల్గొని, ఆలయానికి విచ్చేసిన భక్తులకు స్వయంగా వడ్డన చేసి అన్నదాన సేవలో పాలుపంచుకున్నారు. అన్నదానం మహాదానమని పేర్కొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు , భక్తులకు నిస్వార్థంగా సేవలందిస్తూ



అన్నప్రసాద వితరణను విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను, అన్నదాన నిర్వాహకులను అభినం దించారు. ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సేవాభావాన్ని పెంపొంది స్తాయని అన్నారు. వారి ఆహ్వానాన్ని మన్నించి ఆలయానికి విచ్చేసి సేవ చేసుకున్న వడ్డేపల్లి



రాజేశ్వరరావు ని ఆలయ కమిటీ సభ్యులు మరియు అర్చకులు వేదమంత్రోచరణలతో సన్మానించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు, స్థానిక ప్రముఖులు మరియు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికత, సంప్రదాయాలు మన సంస్కృతికి మూలస్తంభాలు : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

( జూలై - 11- హంస కలంవార్త )

132 - జీడిమెట్ల డివిజన్ అంగడిపేటలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... బొడ్రాయి గ్రామానికి ఆధ్యాత్మిక రక్షణ కల్పించే పవిత్ర చిహ్నమని, గ్రామ ఐక్యతకు, శాంతి, సౌభాగ్యాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మన పూర్వీకుల సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామాల్లో జరిగే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య సోదరభావం, ఐక్యతను పెంపొందిస్తాయని, సమాజంలో సానుకూల వాతావరణాన్ని నెలకొల్పుతాయని తెలిపారు. గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురా రోగ్యాలతో, ఐశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ అమ్మవారి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పేట్ బషీరాబాద్



వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు 3 బులెట్ రైళ్లు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

హంసకలం వార్త



దేశంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే బుల్లెట్ రైలు ప్రాజెక్టుల్లో తెలంగాణకు భారీ ప్రాధాన్యత దక్కింది. దేశవ్యాప్తంగా మొత్తం 7 బులెట్ ట్రైన్ మార్గాలను ప్రకటిస్తే, అందులో మూడు మార్గాలు తెలంగాణకే దక్కాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. హైదరాబాద్ హైటెక్స్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ బులెట్ రైళ్ల రాకతో నగరాల మధ్య ప్రయాణ సమయం ఊహించని విధంగా తగ్గిపోనుందని మంత్రి పేర్కొన్నారు. కొత్త లైన్ల ద్వారా ప్రయాణ వేళల వివరాలను ఆయన వెల్లడించారు

**-బులెట్ రైలు -ప్రయాణ సమయాలు**

హైదరాబాద్ టు బెంగళూరు కేవలం 2 గంటల 35 నిమిషాలు హైదరాబాద్ టు ముంబై కేవలం 2 గంటల 20 నిమిషాలు హైదరాబాద్ టు పుణే:కేవలం 2 గంటలు హైదరాబాద్ టు విజయవాడ కేవలం 70 నిమిషాలు (1 గంట 10 నిమిషాలు) ### ఐటీ »AI' వైపు అడుగులు వేయాలి ఇదే వేదికపై ఐటీ రంగ ప్రగతిని ప్రస్తావిస్తూ.. ప్రస్తుతం సమాచార సాంకేతిక రంగం వేగంగా మారుతోందని మంత్రి అన్నారు. సాఫ్ట్‌వేర్ యాజ్ ఎ సర్వీస్ (SaaS) దశ నుంచి పరిశ్రమ ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) వైపు వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. టెక్నాలజీ హబ్‌గా ఉన్న హైదరాబాద్ ఈ దిశగా మరింత చొరవ చూపాలని, భవిష్యత్ అంతా ఏఐ (AI) సాంకేతికతపైనే ఆధారపడి ఉంటుందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఐటీ ప్రముఖులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## శనివారం నాడు యాదగిరిగుట్ట ఆలయంలో దర్శన వేళల్లో మార్పులు



( జూలై - 11- హంస కలంవార్త )

శనివారం నాడు యాదగిరిగుట్ట ఆలయంలో దర్శన వేళల్లో మార్పులు తెలంగాణ : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నూతన పాలకవర్గం జులై 11న ప్రమాణ స్వీకారం చేయనుంది. ఈ నేపథ్యంలో నేడు ఉ.11 గంటల నుంచి మ.1 గంట వరకు భక్తుల దర్శనాలను నిలిపివేస్తారు. అలాగే ఉ.9 గంటల నుంచి మ.1 గంట వరకు కొండపైకి ప్రైవేటు వాహనాలకు అనుమతి ఉండదు. సుదర్శన నరసింహ హోమం, బ్రేక్ దర్శనం, నిత్య కల్యాణ మహోత్సవం సమయాల్లో కూడా మార్పులు చేశారు. భక్తులు ఈ మార్పులను గమనించి తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలని ఆలయ అధికారులు సూచించారు.

## తెలంగాణ ప్రభుత్వం సమాచార పౌర సంబంధాల శాఖ

**-ప్రత్యేక సమగ్ర సవరణ "లిసర్" ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు.**



( జూలై - 11- హంస కలంవార్త )

ఎన్యుమరేషన్ ఫారాలు పూరించడంలో ఓటర్లకు అవగాహన కల్పించడంతోపాటు ప్రత్యేక సమగ్ర సమరణ సర్ ప్రక్రియను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి పర్యవేక్షించారు. శనివారం కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలాజీ నగర్ వార్డు కార్యాలయంలో నిర్వహిస్తున్న "సర్" ప్రక్రియను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ బిఎల్ఓ లు ఫారాల పంపిణీ కార్యక్రమం సజావుగా జరుగుచున్నదా, ఓటర్లు నింపిన ఫారాలను తిరిగి తీసుకుంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను పరిశీలించారు. ఫారాల ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫారాలను ఏ విధంగా డిజిటలైజ్ చేస్తున్నారని, డిజిటలైజేషన్ ప్రక్రియను ఆపరేటర్ల తో జాగ్రత్తగా చేయించాలన్నారు. బి ఎల్ వో లు ఓటర్ల నుండి తీసుకున్న ఫారాలను వెంటవెంటనే డిజిటలైజేషన్ చేయించాలని ఆదేశించారు. అదే ప్రాంతంలోని అపార్ట్మెంట్ల లో బిఎల్వోలు నిర్వహిస్తున్న ఫారాల అప్లోడింగ్, పూరించిన ఫారాలను తీసుకునే ప్రక్రియను సీఈవో పర్యవేక్షించారు. ఓటర్ల ఫారాలు పూరించడంలో వారికి అవగాహన కల్పిస్తూ అవసరమైన సహాయ సహకారాలను అందించాలని తెలిపారు. అందుబాటులో లేని ఓటర్లను ఫోన్ల ద్వారా వివరాలు సేకరించి వారికి ఫారాలను అందించాలని ఆదేశించారు. బి ఎల్ వో లకు కేటాయించిన ప్రాంతాలలో అందుబాటులో లేని వారి వివరాలను సూపర్వైజర్లకు తెలియజేయాలని సూచించారు. 2002లో లేని వారి ఫారాలు ఏ విధంగా పూరించాలి అనే అంశంపై సీఈవో వివరించారు. అనంతరం కెపిహెచ్బి 6 ఫేస్ లోని అపార్ట్మెంట్లో నిర్వహిస్తున్న "సర్" ప్రక్రియలో భాగంగా ఓటర్లతో సీఈవో నేరుగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం గ్రేటర్ కమ్యూనిటీలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ పరిశీలించి బిఎల్ఓ ల పనితీరును పర్యవేక్షించి అక్కడ ఉన్న ఓటర్లు అడిగిన సందేహాలకు సీఈవో సమాధానం ఇచ్చారు. ఈ పర్యటనలో కూకట్ పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, కూకట్ పల్లి ఎమ్మార్వో అశోక్ , డిసి ఆంజనేయులు సూపర్వైజర్లు, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు

## పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర కీలకం

**– సి ఆర్ బిస్వాల్ ఐఏఎస్**



హంసకలం వార్త

మన దేశ భవిష్యత్తు నేటి బాలల చేతుల్లోనే ఉందని, పర్యావరణాన్ని కాపాడుకోవడంలో విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని సిఆర్ బిస్వాల్ ఐఏఎస్ అన్నారు . అన్మాస్పల్లి ఎర్త్ సెంటర్ లో యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎంపిక చేసిన 20 పాఠశాలలో శిక్షణ ముగింపు కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీజిఆర్ ఫౌండర్ అండ్ చైర్మన్ లీలా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథి గా సి ఆర్ బిస్వాల్ ఐఏఎస్ పాల్గొని మాట్లాడుతూ, లక్ష్మారెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా, సొంత ఖర్చులతో ఇటువంటి మంచి కార్యక్రమాలను నిర్వహిస్తుండటంఅభినందనీయమన్నారు. హరితహారం కార్యక్రమాల్లో పాఠశాల విద్యార్థులను పెద్ద ఎత్తున భాగస్వాములను చేస్తే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులతో . "మానవునికి నిజమైన స్నేహితుడు ఎవరు?" అని ఆయన ప్రశ్నించగా, విద్యార్థులు ఏకగ్రీవంగా "చెట్లు" అని సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ భూమిపై మానవులు లేకపోయినా చెట్లు బ్రతకగలవని, కానీ చెట్లు లేకపోతే మానవ మనుగడ సాధ్యం కాదని స్పష్టం చేశారు. చెట్లు మానవాళికి ఆహారాన్ని అందించడమే కాకుండా, మనం తినే మాంసాహారానికి కారణమైన జంతువులు కూడా పరోక్షంగా చెట్ల పైనే ఆధారపడి జీవిస్తాయని గుర్తుచేశారు.ఆక్సిజన్ ప్రాముఖ్యతను వివరిస్తూ, "ఆక్సిజన్ అనేది కేవలం శ్వాస పీల్చడానికే కాదు, శరీరంలో శక్తి (ఎనర్జీ) ఉత్పత్తి కావడానికి, రక్తం ద్వారా ఆహారం మండటానికి (కంబషన్) ఎంతో అవసరం" అని విద్యార్థులకు వివరించారు. దీనిని నిరూపించడానికి ఆయన వెలుగుతున్న కొవ్వొత్తిపై గ్లాస్ బోర్లిస్తే ఆక్సిజన్ అందక అది ఆరిపోయే ఉదాహరణను గుర్తుచేశారు.ప్రస్తుతం పరిశ్రమలు, వాహనాల వల్ల వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ వంటి హానికరమైన వాయువులు ప్రమాదకరంగాపెరుగుతున్నాయని, దీనివల్ల భూమి వేడెక్కి 'గ్లోబల్ వార్మింగ్' ముప్పు పొంచి ఉందని హెచ్చరించారు. ఈ కార్బన్ డయాక్సైడ్ ను పీల్చుకుని, మనకు ప్రాణాధారమైన ఆక్సిజన్ ను ఇచ్చే అద్భుత శక్తి వృక్షాలకు మాత్రమే ఉందన్నారు. వాతావరణాన్ని చల్లబరచడానికి, గ్లోబల్ వార్మింగ్ ను అరికట్టడానికి రాబోయే వందల, వేల సంవత్సరాల పాటు మానవజాతి సురక్షితంగా ఉండాలంటే చెట్లను నాటడం, వాటిని సంరక్షించడం మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా సైనిస్ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ జీవవైవిధ్య సంరక్షణ పర్యావరణ కాలుష్యం నివారణ అంటే అంశాలపై విద్యార్థుల్లో అవగాహన కలిగించడమే ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఈఎల్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ యనాల వెంకట్ రెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్ రెడ్డి, పుడమి మ్యాగ్జిన్ ఎడిటర్ రమేష్ రావు,డి ఎస్ ఓ రాజ శేఖర్ ,వైఈఎల్పీ ఇన్‌చార్జ్ రజనీకాంత్, సీజీఆర్ సభ్యులు నగేష్, శంకరయ్య, హనుమంత్, ఉపాధ్యాయులు, యంగ్ ఎర్త్ లీడర్స్‌గా ఎంపికైన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సులు నడపాలనేది ప్రభుత్వ లక్ష్యం

**–రాష్ట రోడ్డు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**–తెలంగాణ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల వ్యవధిలోనే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించాం**

**–ఇప్పటివరకు 11 వేల కోట్ల వరకు ఉచిత బస్ ప్రయాణాలు జరిగాయి**



హంసకలం వార్త

తెలంగాణ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల వ్యవధిలోనే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించామని రాష్ట రోడ్డు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.శనివారం హుజుర్నగర్ లో 3.52 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మిస్తున్న బస్సు స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర ఆహార పౌరసరఫరాలు మరియు నీటి పారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 3.52 కోట్ల రూపాయలతో బస్సు స్టేషన్ నిర్మాణం చేసుకోవడం చాలా సంతోషంగా ఉన్నదని,తెలంగాణ వ్యాప్తంగా 10,173 ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రజలను గమ్యస్థానాలకు చేర్చడం జరుగుతుందని,35 లక్షల మహిళలు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం చేస్తున్నారని ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అందించడం ద్వారా ఇప్పటివరకు 326 కోట్ల ప్రయాణాలు పూర్తయ్యాయని, మహిళలకు 11,400 కోట్ల రూపాయల మేర ప్రయోజనం చేకూర్చామని అన్నారు.మహిళా సంఘాలకు 600 బస్సులను అందించి ఆర్టీసీని బలోపేతం చేస్తున్నామని,కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.తదుపరి ఆహార,పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి పేదవాడి కడుపు నింపేందుకు సన్న బియ్యంతో పాటు,మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. హుజూర్‌నగర్ లో బస్టాండ్ నిర్మాణంతో ప్రయాణాలు మరింత సులభతరం అవుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై నాగిరెడ్డి,జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు,మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్,మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికా,మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్, ఆర్డీవో శ్రీనివాసులు,తాహసిల్దార్ కవిత పట్టణ ప్రజలు తదితరులు అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్-2026ను పారదర్శకంగా నిర్వహించాలి

**–జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**



హంసకలం వార్త

ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించి,అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)పి.చంద్రయ్య అన్నారు. శనివారం జిల్లాలోని కాసిపేట మండలం దేవాపూర్ లో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణను మండల తహసిల్దార్, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలని, ఈనెల 24వ తేదీ వరకు పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు, సూపర్వైజర్లు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో పని చేయాలని, ఓటరు జాబితాలో నమోదు చేసే దిశగా ఇంటింటా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. గ్రామంలోని 4 వార్డులను సందర్శించి ఇంటింటి సర్వే, ఎన్యూమరేషన్ ఫారాల పూరింపు ప్రక్రియను పరిశీలించారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు చేయాలని, ఫారాల పరిశీలనలో పూర్తి పారదర్శకత పాటిస్తూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబం

భూముల రీసర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

ధనల మేరకు విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించి ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలలో మరింత విశ్వాసం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను మండల విద్యాధికారితో కలిసి సందర్శించి రిజిస్టర్లు, విద్యార్థుల హాజరు, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. విద్యాభ్యాసం,వసతి, భోజనం,త్రాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, ఇతర సౌకర్యాలపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు, ఇతర అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి ఆహార నాణ్యత, మెనూ అమలు తీరును పరిశీలించారు. తెలంగాణ మోడల్ స్కూల్ ను సందర్శించి తరగతి గదులు, గ్రంథాలయం,పాఠశాల ఆవరణను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులలో అభ్యాస నైపుణ్యాలు పెంపొందేలా నాణ్యమైన బోధన అందించాలని, గ్రంథాలయాన్ని సమర్థవంతంగా వినియో గించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యా యులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, నాణ్యమైన విద్యపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించి విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని తెలిపారు.అనంతరం బెల్లంపల్లి మండలం రవీంద్ర నగర్,బూదఖుర్ద్ గ్రామపంచాయతీలలోని కాశిరెడ్డిపల్లి లలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణను మండల తహసిల్దార్,మండల పరిషత్ అభివృద్ధి అధికారి,మండల పంచాయతీ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ నెల 24వ తేదీలోగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి అలసత్వానికి తావు లేకుండా ఫారాలను క్షుణ్ణంగా పరిశీలించి స్పష్టంగా నమోదు చేయాలని, అర్హులైన ప్రతి ఓటరు వివరాలు తప్పనిసరిగా నమోదు అయ్యేలా సృష్టి సారించాలని తెలిపారు. మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ బాలురు,బాలికల పాఠశాలలు, కళాశాలలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యార్థుల హాజరు, పరిసరాలు, భోజనశాల,తరగతి గదులు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులలో అభ్యసన నైపుణ్యాలను పెంపొందించేలా విద్యా బోధన చేయాలని, విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని తెలిపారు.

# భూముల రీసర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

**–రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



హంసకలం వార్త

రాష్ట్రంలో భూముల రీసర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి రాష్ట్ర మంత్రి, హైదారాబాద్ నుండి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్,గృహ నిర్మాణ శాఖ ఎం.డి. వి.పి .గౌతమ్,సెర్ప్ సి.ఈ.ఓ. దివ్య దేవరాజన్ లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూముల సర్వే, రీసర్వే కార్యక్రమం అమలు, పురోగతి, చేపట్టాల్సిన కార్యాచరణ,భూ భారతి, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడక గదుల ఇండ్ల పంపిణీ,విద్యార్థుల యూనిఫాంల పంపిణీ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...రాష్ట్రంలో రెవెన్యూ మ్యాపులు అందుబాటులో లేని గ్రామాలకు శాశ్వత భూ రికార్డుల రూపకల్పన లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాలలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, జి.పి.ఎస్. ఆధారిత సర్వే పరికరాలు,డిజిటల్ మ్యాపింగ్ విధానాలను వినియోగిస్తూ రీసర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రతి దశలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతా యుతంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించాలని, అవసరమైన చోట తక్షణ నిర్ణయాలు తీసుకుని ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. గ్రామస్థులకు సర్వేపై పూర్తి అవగాహన కల్పించి, వారి అభ్యంతరాలు, సందేహాలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమగ్ర సర్వే పూర్తయిన అనంతరం రాష్ట్రంలో భూ రికార్డులు మరింత ఖచ్చితత్వంతో సిద్ధమవడంతో భూ వివాదాల పరిష్కారం సులభతరం అవుతుందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి కారణాలను గుర్తించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ భారతిలో భూ రీ-సర్వే కొరకు శిక్షణ పొందిన 5 వేల 700 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాలలో చేపట్టిన రీ-సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కరించడం జరిగిందని తెలిపారు. సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల మేరకు పరిష్కరించి, అర్హులైన వారికి నోటీసులు త్వరితగతిన జారీ చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ భూముల రీ సర్వే, భూభారతి, సాదా బైనమా దరఖాస్తుల పరిష్కారం,ఇందిరమ్మ ఇండ్లు ఇతర ప్రభుత్వ పథకాల అమలులో నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో పని చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ )వి.రాములు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే భూ రీ-సర్వే లక్ష్యం

**–జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

హంసకలం వార్త

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ భారతి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.శనివారం ఖమ్మం సమీకృత కలెక్టరేట్ నుంచి భూ రీ-సర్వే, భూ భారతి అమలు, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ, విద్యార్థుల యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ పాల్గొన్నారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చి రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ధరణి కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న 9.6 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి కారణాలను గుర్తించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశి ంచారు.భూ భారతి విజయవంతమైన అమలుకు భూ రీ-సర్వే తప్పనిసరి అని నిపుణుల సూచనల మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు.ఇందుకోసం శిక్షణ పొందిన 5,700 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని సూచిం చారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో చేపట్టిన రీ-సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమైనట్లు మంత్రి తెలిపారు.తొలి విడతలో ప్రతి



జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ-సర్వే చేపడుతున్నామని పేర్కొన్నారు.అలాగే సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల మేరకు పరిష్కరించి,అర్హులైన వారికి నోటీసులు త్వరితగతిన జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్.చిత్రు, ఆర్డీవో జగదీశ్వర్ రావు, ఉట్నూర్ ఆర్డీవో మోహన్ సింగ్, ఏవో వర్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణను వణికించిన దారుణం ఫోక్సోకేసు కక్షతో ఆరుగురిని నరికేశాడు!

**నరరూప రాక్షసుడిలా మారిన వ్యక్తి సృష్టించిన నరమేధం**
**-ఒకే కుటుంబంలో ఆరుగురి హత్య మైనర్ బాలికపై ఘోర హత్యాచారం**
**-శనివారం తెల్లవారుజామున అత్యంత దారుణ సంఘటన**
**-ఆరుగురిని చంపిన తర్వాత పోలీసులకు ఫోన్ చేసి పరార్!**
**-రాజ్ కుమార్ అనే వ్యక్తి కిరాతకం నిందితుడి కోసం పోలీసుల గాలింపు**

హంసకలం వార్త

రంగారెడ్డి జిల్లాలో శనివారం తెల్లవారుజామున అత్యంత దారుణ సంఘటన చోటు చేసుకుంది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో నరరూప రాక్షసుడిలా మారిన ఒక వ్యక్తి సృష్టించిన నరమేధం తెలుగు రాష్ట్రాలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. దైవాలగూడ గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురిని రాజ్ కుమార్ అనే వ్యక్తి అత్యంత కిరాతకంగా కత్తితో పొడిచి హత్య చేశాడు. నిందితుడు అర్ధరాత్రి వేళ ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. చంపబడిన వారిలో నిందితుడి భార్య, ఇద్దరు చిన్నారులతో పాటు మరో ముగ్గురు ఉన్నారు. ఈ ఘోరకలిని చూసి స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు.

**-ఫోక్సో కేసు కక్షను మనసు లో ఉంచుకుని, పగతో రగిలిపోయి హత్యలు**

గతంలో నిందితుడు రాజ్ కుమార్ పై ఫోక్సో కేసు నమోదైంది. ఆ కక్షను మనసులో ఉంచుకుని, ఫోక్సో కేసు బాధితురాలైన 17 ఏళ్ల మైనర్ బాలికను ఇంట్లోంచి బలవంతంగా పొలం వద్దకు తీసుకెళ్లి, అక్కడ హత్యాచారం చేసి దారుణంగా చంపేశాడు. అంతటితో ఆగకుండా బాలిక తల్లి చిట్యాల లక్ష్మి (45), నానమ్మ చిట్యాల రుక్కమ్మ (65)లను సైతం మట్టుబెట్టాడు. అనంతరం తన సొంత భార్య పార్వతి సరిత (30), తన ఇద్దరు చిన్న పిల్లలైన పరీక్షిత్ (3), దైవిక్షిత్ (2)లను కూడా కత్తితో పొడిచి ప్రాణాలు తీశాడు.




**-ఆరుగురిని కిరాతకంగా చంపినతర్వాత పోలీసులకు ఫోన్ చేసి పరార్!**

ఆరుగురిని కిరాతకంగా చంపిన తర్వాత, తాను కూడా చనిపోతున్నానంటూ నిందితుడు రాజ్ కుమార్ స్వయంగా పోలీసులకు సమాచారం ఇచ్చి అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న సైబరాబాద్ సిపి రమేష్ రెడ్డి, ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

# ఈ నెల 24లోగా ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలి

**-అర్హుల ఓటు తొలగిపోకూడదు**
**-అనర్హుల ఓటు జాబితాలో ఉండకూడదు**
**-ఒక వ్యక్తి ఒక ఓటు మాత్రమే కలిగి ఉండాలి**
**-అచ్చంపేట లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్**
**-పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

హంసకలం వార్త

జిల్లాలోని అచ్చంపేట పట్టణ కేంద్రంలోని 2వ వార్డు సాయినగర్‌లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శనివారం పరిశీలించారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన, డిజిటలైజేషన్, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రామ్‌సింగ్ అనే ఓటరు వివరాలను జిల్లా కలెక్టర్ స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. అనంతరం ఇంటింటికీ పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాల వివరాలు, ప్రజల నుంచి తిరిగి స్వీకరించిన దరఖాస్తులు, వాటి ఆన్‌లైన్ నమోదు, పెండింగ్‌లో ఉన్న ఫారాలు, నమోదు పురోగతి వంటి అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..... , ప్రతిబిఎల్ ప్రతిరోజు 60 మంది ఓటర్ల వివరాలను నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 24వ తేదీలోగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియను పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని రెవెన్యూ, ఎన్నికల శాఖ అధికారులను ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి అర్హుడైన పౌరుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయాలని, ఎవ్వరూ ఈ ప్రక్రియకు ఏ ఒక్క అర్హులైన ఓటర్ దూరం కాకుండా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. అనర్హులైన ఓట్ల తొలగింపు ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేసుకుని చర్చించిన అనంతరమే తుది నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అర్హులైన ఒక్క ఓటు కూడా పొరపాటున తొలగిపోకుండా, అదే సమయంలో అనర్హులైన ఓట్లు జాబితాలో కొనసాగకుండా అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా విశ్వసనీయతను కాపాడే బాధ్యత ప్రతి అధికారిపై ఉందని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. జిల్లాలోని వేర్వేరు నియోజకవర్గాల్లో లేదా ఇతర జిల్లాల్లో ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ ఓటర్లు నమోదు కావడం చట్టవిరుద్ధమని జిల్లా ఎన్నికల అధికారి హేమంత్ కేశవ్ పాటిల్ హెచ్చరించారు. భారత ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకొచ్చిన డెమోగ్రాఫికల్లీ సిమిలర్ ఎంట్రీస్ (DSE) సాఫ్ట్‌వేర్ ద్వారా డూప్లికేట్ ఓట్లను సులభంగా గుర్తించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సాంకేతిక వ్యవస్థతో ఒకే వ్యక్తి పేరుతో వివిధ ప్రాంతాల్లో నమోదైన ఓట్లను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా రెండు లేదా అంతకంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల్లో ఓటు హ క్కు వినియోగిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఏడాది వరకు జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించే అవకాశం ఉందని కలెక్టర్ హెచ్చరించారు. అలాంటి కేసులు గుర్తించిన వెంటనే సంబంధిత వ్యక్తులకు



నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావడమే భారత ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని కోరారు. చిరునామా మార్పు, పేరు, వయస్సు, కుటుంబ వివరాల్లో మార్పులు ఉన్నవారు కూడా సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి దశను కచ్చితంగా అమలు చేస్తూ ప్రజలకు విశ్వసనీయమైన ఓటర్ల జాబితాను అందించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు.

జిల్లా కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, అచ్చంపేట తాహసిల్దార్ సైదులు, బి ఎల్ ఓ తిరుపతమ్మ, మున్సిపల్ అధికారులు తదితరులు ఉన్నారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే భూ రీ-సర్వే లక్ష్యం

**-రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

హంసకలం వార్త

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే భూ రీ-సర్వే లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. భూ రీ-సర్వే, భూ భారతి అమలు, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ, విద్యార్థుల యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం ఖమ్మం జిల్లా సమీకృత కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి. గౌతమ్, సెర్ప్ సీఈవో దివ్య రాజన్ పాల్గొన్నారు. జగిత్యాల సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)బి. ఎస్ లత ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో చేరలేకపోయామని తెలిపారు. ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.6 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి, హైకోర్టు సమస్యలను పరిష్కరించినప్పటికీ అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ-సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. భూముల రీ సర్వే కోసం శిక్షణ పొందిన 5,700 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్లకు ఉద్యోగం లేదా రెగ్యులరైజేషన్ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి ఆయా గ్రామాల రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారని గుర్తు చేశారు. తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ-సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఒక సర్వే నంబరులో కొంత భూమి మాత్రమే ప్రభుత్వ అవసరాలకు సేకరించినప్పటికీ మొత్తం భూమిని నిషేధిత జాబితాలో ఉంచడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించి నోటీసులు త్వరితగతిన జారీ చేయాలని సూచించారు. పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన 6,500 రెవెన్యూ సమస్యల్లో 98 శాతం సమస్యలకు భూ రీ-సర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను వెంటనే పూర్తి చేసి గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, మొదటి విడతలో మంజూరు కాని అర్హుల ఇళ్లను కూడా రెండో విడతలో చేర్చి మంజూరు చేయాలని సూచించారు. ఇసుక, కంకర సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను పొంగులేటి ఆదేశించారు. తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూ రీ-సర్వేను నవంబర్‌లోపు పూర్తి చేయాలని, రెండో విడతలో మరో 70 గ్రామాల్లో మార్చి-2027లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రీ-సర్వే పూర్తయితే సాదాబైనామా దరఖాస్తుల తిరస్కరణలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని లోకేష్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో




సుమారు 41 వేల గుడిసెలను గుర్తించామని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ఆగస్టు నాటికి రెండు లక్షల ఇళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలని, పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని గౌతం సూచించారు. జిల్లాలోని 70 గ్రామాల్లో జరుగుతున్న రీ-సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో అదనంగా 5 రోవర్స్ కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఆర్డీవోలు, తాహసిల్దార్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో పూర్తిస్థాయిలో సర్వే చేయాలని అన్నారు. దజిల్లాలో జరుగుతున్న సర్ (ఎస్.ఐ.ఆర్) నమోదు శాతాన్ని మెరుగుపరచాలని అన్నారు. తహసిల్దార్లు, బి.ఎల్.వో లతో క్షేత్రస్థాయిలో పనిచేయాలని అన్నారు. అదేవిధంగా జిల్లాలో రెవెన్యూ సదస్సులలో వచ్చిన సాధా బైనామాల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సత్య ప్రసాద్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జగిత్యాల, కోరుట్ల, మెట్ పెల్లి ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి నరసింహారావు, సర్వే ఏడి కిషన్ ప్రసాద్ కలెక్టరేట్ ఏ.వో కిషన్, మున్సిపల్ కమిషనర్లు, తాహసిల్దార్లు, లైసెన్స్ సర్వేయర్లు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి విద్యుత్ శాఖపై సమీక్ష

హంసకలం వార్త



రైతులకు అందుబాటులో ఉండే విధంగా అధికారుల కార్యాలయాలు ఉండాలని,దాంట్లో భాగంగానే చండూరులో విద్యుత్ శాఖ డివిజనల్ అధికారి కార్యాలయం ఏర్పాటు చేయాలని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి విద్యుత్ శాఖ సీఎండికి ఫోన్ చేసి చెప్పారు.శుక్రవారం మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత ఎక్కువగా ఉన్నదని,రైతులకు, కస్న్యూమర్లకు ఉన్న సిబ్బందితో సర్వీసు ఇవ్వడం ఇబ్బందిగా మారి వారిపై పని ఒత్తిడి ఎక్కువైందని, వీలైనంత తొందరగా క్షేత్రస్థాయిలో సిబ్బందిని నియమించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగాలో వోల్టేజ్ సమస్యని ఎప్పటికప్పుడు పరిష్కరిం చాలన్నారు. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా నూతన రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నాయని,ఆ రోడ్డు వెడల్పు పనులలో అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలన్నారు. సడన్ గా వచ్చే గాలి దుమారాల వల్ల లైన్స్ అన్ని లూస్ అవుతున్నాయని,ఆ లూస్ లైన్స్ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని,వాటిని అరికట్టాలన్నారు.ఈ సమీక్ష సమావేశంలో నల్గొండ జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస్, డిఈలు ప్రసాద్,బాల్య నాయక్, ఏడిఈ నాగేశ్వరరావు,సాగర్ రెడ్డి ఏఈలు పాల్గొన్నారు.

# అయోధ్య రాముడి విరాళాల చోరీపై రంగంలోకి సుప్రీంకోర్టు

**-ఈనెల 13న కీలక విచారణ**



హంసకలం వార్త

అయోధ్య రామ మందిరం విరాళాల చోరీ మరియు నిధుల దుర్వినియోగంపై దాఖలైన కీలక పిటిషన్లను ఈ నెల 13 (సోమవారం)న సుప్రీంకోర్టు విచారించనుంది.సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి,జస్టిస్ మోహన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ విచారణను చేపట్టబోతోంది. సోమవారం ఉదయం న్యాయస్థానం కార్యకలాపాలు ప్రారంభమైన వెంటనే విచారించాల్సిన అత్యవసర కేసుల జాబితాలో (కాజ్ లిస్ట్) ఈ పిటిషన్లను చేర్చారు.కోట్లాది మంది భక్తులు సమర్పించిన విరాళాల రక్షణ మరియు పారదర్శకతకు సంబంధించిన అంశం కావడంతో ఈ విచారణ ప్రాధాన్యత సంతరించుకుంది.శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు అందిన విరాళాల చోరీకి సంబంధించి,కేవలం స్థానిక పోలీసు దర్యాప్తు మాత్రమే సరిపోదని పిటిషనర్లు తమ పిటిషన్లలో పేర్కొన్నారు.సుప్రీంకోర్టు ప్రత్యక్ష పర్యవేక్షణలో కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)చేత నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని వారు కోరుతున్నారు.

# రెండు చోట్ల ఓటు ఉంటే ఏడాది జైలు...!

**-సర్'లో తప్పనిసరిగా పాల్గొనాలి**
**-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సి.సుదర్శన్‌రెడ్డి**

హంసకలం వార్త




ఒక వ్యక్తి రెండు చోట్ల ఓటరుగా నమోదు కావడం చట్టవిరుద్ధమని, ఉద్దేశపూర్వకంగా రెండు చోట్ల ఓటు నమోదు చేయించుకున్నట్లు తేలితే ఏడాది వరకు జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించే అవకాశం ఉందని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సి.సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు.ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ --సర్)పై ఆయన మాట్లాడుతూ,రాష్ట్రంలోని ప్రతి అర్హ ఓటరు తమ ఓటు హక్కును కాపాడుకునేందుకు 'సర్' ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా నింపి బూత్ లెవల్ అధికారులకు (బీఎల్‌వోలు) అందజేయాలని పేర్కొన్నారు. ఈ నిబంధనలో ముఖ్యమంత్రి,ప్రధానమంత్రి సహా ఎవరికీ మినహాయింపు లేదని స్పష్టం చేశారు. ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారం అందకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,అలాంటి వారు నేరుగా ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 'సర్' ప్రక్రియ వేగంగా కొనసాగుతుండగా, పట్టణ ప్రాంతాల్లో చిరునామా మార్పులు,నివాస ధ్రువీకరణ వంటి సమస్యల కారణంగా కొంత ఆలస్యం జరుగుతోందన్నారు.కొన్ని ప్రాంతాల్లో బీఎల్‌వోలకు పూర్తి స్థాయి అవగాహన లేకపోవడం వల్ల ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీలో జాప్యం జరిగినట్లు గుర్తించామని,వారికి అవసరమైన శిక్షణ, మార్గదర్శకాలు అందించి ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు సీఈవో వెల్లడించారు.ఓటరు జాబితా పరిశుద్ధతను కాపాడేందుకు ప్రతి పౌరుడు సహకరించాలని,అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సకాలంలో ధృవీకరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# బిజినెస్

## పీఎఫ్ ఖాతాల్లో వడ్డీ డబ్బులు.. జులై 15 నాటికి అందరి ఖాతాల్లో వడ్డీ జమ

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) తన చందాదారులకు తీపి కబురు అందించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ 8.25 శాతం వడ్డీని ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను ప్రారంభించింది. ఈ ప్రక్రియ ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 34 కోట్ల మంది సభ్యుల ఖాతాల్లోకి వడ్డీ సొమ్ము జమ కానుంది. 2026 జులై 15 నాటికి సభ్యులందరి పాస్‌బుక్‌లలో అప్‌డేట్ అయిన బ్యాలెన్స్ కనిపిస్తుందని అధికారులు వెల్లడించారు.కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ఇటీవల ఈ విషయాన్ని ప్రకటించారు. కొత్తగా ప్రవేశపెట్టిన కేంద్రీకృత ఐటీ ఆధారిత సేవల (సీఐటీఈఎస్) వ్యవస్థ ద్వారా రూ.1.44 లక్షల కోట్లకు పైగా వడ్డీని ఆటోమేటిక్‌గా ప్రాసెస్ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గతంలో వడ్డీ జమ ప్రక్రియ అక్టోబర్ లేదా నవంబర్ వరకు ఆలస్యమయ్యేదని, అయితే సరికొత్త సాంకేతికతతో ఈసారి ప్రక్రియ అత్యంత వేగంగా పూర్తవుతోందని ఆయన పేర్కొన్నారు. జులై 11 నాటికే సుమారు 80 శాతం ఖాతాల్లో వడ్డీ జమ అయినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. మిగిలిన ఖాతాలకు కూడా జులై మధ్య నాటికి ప్రక్రియ పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒకవేళ తమ ఖాతాలో వడ్డీ వెంటనే కనిపించకపోయినా సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సిస్టమ్ అప్‌డేట్ అవుతున్నందున కొద్ది రోజుల్లో బ్యాలెన్స్ కనిపిస్తుందని అధికారులు సూచించారు.

## మార్కెట్లోకి హీరో విడా కొత్త ఈ-స్కూటర్- ఒక్క చార్జ్‌తో 187 కి.మీ. రేంజ్!



ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ తన ఎలక్ట్రిక్ బ్రాండ్ 'విడా' కింద మరో కొత్త స్కూటర్‌ను భారత మార్కెట్లోకి తీసుకొచ్చింది. అధిక రేంజ్ కోరుకునే వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని 'విడా VX2 ప్లస్ 4.4 kWh' వేరియంట్‌ను ఆవిష్కరించింది. ఒక్కసారి ఫుల్ చార్జ్ చేస్తే ఈ స్కూటర్ 187 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని కంపెనీ ప్రకటించింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర (న్యూఢిల్లీ) రూ. 1.44 లక్షలుగా నిర్ణయించారు. ఈ కొత్త స్కూటర్‌లో 2.2 నెవ్వే సామర్థ్యం గల రెండు రిమూవబుల్ బ్యాటరీ ప్యాక్‌లను అమర్చారు. దీని గరిష్ఠ వేగం గంటకు 90 కిలోమీటర్లు. కేవలం 3.1 సెకన్లలోనే 0 నుంచి 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. పోర్టబుల్ చార్జర్‌తో సుమారు 3 గంటల 30 నిమిషాల్లో 80 శాతం వరకు చార్జ్ చేయవచ్చు. అదే డీసీ ఫాస్ట్ చార్జర్‌తో అయితే కేవలం 65 నిమిషాల్లోనే 80 శాతం చార్జింగ్ పూర్తవుతుంది. ఫీచర్ల విషయానికొస్తే... ఇందులో 27.2 లీటర్ల అండర్ సీట్ స్టోరేజ్, డిస్క్, డ్రమ్ బ్రేక్స్, స్మార్ట్ కనెక్టివిటీ వంటి సదుపాయాలు ఉన్నాయి. కొనుగోలు భారాన్ని తగ్గించేందుకు 'బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్' మోడల్‌లో కూడా దీన్ని కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పించారు. ఇంట్లోనే బ్యాటరీలను చార్జ్ చేసుకునే వెసులుబాటు ఉండటం వల్ల రేంజ్ గురించిన ఆందోళన తగ్గుతుందని కంపెనీ తెలిపింది. ఈ స్కూటర్ జులై చివరి నుంచి విడా డీలర్‌షిప్‌ల వద్ద అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఈ స్కూటర్ సిరీస్ సుదీర్ఘ ప్రయాణం చేసి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించినట్లు కంపెనీ గుర్తుచేసింది.


## యాపిల్ లవర్స్‌కు షాక్: ఐఫోన్ 18 ప్రో ధరల మోత.. ఫోల్డబుల్ 'అల్ట్రా' రాకతో యాపిల్ సంచలనం!

టెక్ దిగ్గజం యాపిల్ నుంచి రాబోయే కొత్త ఐఫోన్‌ల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రతి ఏటా సెప్టెంబర్‌లో జరిగే మెగా ఈవెంట్‌లో యాపిల్ తన కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించడం ఆనవాయితీ. ఈసారి ఐఫోన్ 18 ప్రో సిరీస్‌తో పాటు, యాపిల్ నుంచి రానున్న మొట్టమొదటి ఫోల్డబుల్ ఫోన్ 'ఐఫోన్ అల్ట్రా'పై మార్కెట్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే, తాజా లీక్‌ల ప్రకారం ఈసారి కొత్త ఐఫోన్‌ల ధరలు వినియోగదారుల జేబులకు గట్టిగానే చిల్లు పెట్టేలా ఉన్నాయి.

**-భారీగా పెరగనున్న ధరలు**

ఫోర్బ్స్ కథనం ప్రకారం.. ప్రముఖ మార్కెట్ రీసెర్చ్ సంస్థ 'కౌంటర్‌పాయింట్ రీసెర్చ్' అంచనాల మేరకు ఐఫోన్ 18 ప్రో సిరీస్ తయారీ ఖర్చు గణనీయంగా పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో ఎన్ఏఎన్‌డీ స్టోరేజ్, డీఆర్ఏఎం మెమరీ వంటి కీలక భాగాల ధరలు పెరగడమే దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. దీనికి తోడు, ఈ సిరీస్‌లో ఉపయోగించనున్న 2 నానోమీటర్ టెక్నాలజీ ప్రాసెసర్, కొత్త 'వేరియబుల్-అపెర్చర్' కెమెరా సిస్టమ్ కూడా ఉత్పత్తి వ్యయాన్ని పెంచాయి. ఈ భారాన్ని యాపిల్ వినియోగదారులపై మోపే అవకాశం ఉందని, కొన్ని వేరియంట్ల ధరలు ఏకంగా వి200 (సుమారు రూ. 16,500) వరకు పెరగవచ్చని నివేదికలు చెబుతున్నాయి.

**-5000mAh బ్యాటరీతో 'ఐఫోన్ అల్ట్రా'**



ధరల పెంపు వార్తలు ఒకవైపు ఉంటే, యాపిల్ తొలి ఫోల్డబుల్ ఫోన్ 'ఐఫోన్ అల్ట్రా'కు సంబంధించిన ఆసక్తికర వివరాలు బయటకు వచ్చాయి. మీుఎ=బఎశీతీం రిపోర్ట్ ప్రకారం.. చైనాకు చెందిన టిప్‌స్టర్ 'డిజిటల్ చాట్ స్టేషన్' వీబోలో పంచుకున్న సమాచారం మేరకు యాపిల్ బ్యాటరీ సరఫరాదారు రెండు విడివిడి బ్యాటరీ సెల్స్‌ను సర్టిఫై చేశారు. ఇలాంటి డ్యూయల్-సెల్ బ్యాటరీలను సాధారణంగా ఫోల్డబుల్ ఫోన్లలో వాడతారు. ఈ రెండు బ్యాటరీల మొత్తం కెపాసిటీ 4,883mAhగా ఉందని, మార్కెట్లోకి వచ్చేసరికి దీనిని 5,000వాూ్హ బ్యాటరీగా ప్రమోట్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదే నిజమైతే, ఈ ఫోన్ బ్యాటరీ లైఫ్‌లో శామ్‌సంగ్, గూగుల్ వంటి ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇవ్వనుంది.

---

## ప్రపంచ కప్ ఫిక్సింగ్ ఆరోపణలు-మౌనం వీడిన అర్జెంటీనా కోచ్

ఇంటర్నెట్ డెస్క్:

ఫిఫా ప్రపంచ కప్ 2026లో అర్జెంటీనాపై ఫిక్సింగ్ ఆరోపణలు వస్తోన్న సంగతి తెలిసిందే. ప్రిక్వార్టర్స్‌లో ఈజిప్ట్‌పై అర్జెంటీనా 3-2 తేడాతో విజయం సాధించింది. 2-0 తేడాతో వెనుకబడి ఉన్న డిఫెండింగ్ ఛాంపియన్.. అనూహ్యంగా పుంజుకుని ఆఖరి నిమిషాల్లో 3 గోల్స్ చేసి క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. ఆ మ్యాచ్‌లో వీఏఆర్ వివాదం చెలరేగగా, ఈజిప్ట్ ప్లేయర్లు, సిబ్బంది.. అర్జెంటీనాపై ప్రపంచ కప్ ఫిక్సింగ్ ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో ఆ ఆరోపణలపై ఆ జట్టు ప్రధాన కోచ్ లియోనెల్ స్కలోనీ తొలిసారి స్పందించాడు. అర్జెంటీనా వరుసగా రెండోసారి ప్రపంచ కప్ గెలవకూడదని కోరుకునే వారే ఇలాంటి ప్రచారం చేస్తున్నారని, అలాంటి విమర్శలు తమ ఆటగాళ్లకు మరింత ప్రేరణగా మారుతున్నాయని స్పష్టం చేశాడు. స్విట్జర్లాండ్‌తో శనివారం జరిగే క్వార్టర్ ఫైనల్‌కు ముందు స్కలోనీ మీడియాతో మాట్లాడాడు. 'డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఈ సీజన్‌లో బరిలోకి దిగాం. మేం ఓడిపోవాలని కోరుకునే వారు ఎక్కువగానే ఉంటారు. ఆ విమర్శలు మా ఆటగాళ్ల చెవిన కూడా పడుతున్నాయి. అయితే వాటిని మేం తిరుగుబాటు స్ఫూర్తిగా మార్చుకుని మరింత మెరుగ్గా ఆడేందుకు ఉపయోగించుకుంటాం. 1986లో కూడా మాకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకున్నారని అప్పట్లో ఆరోపణలు చేశారు. కాబట్టి ఇవన్నీ మాకు కొత్తేం కావు. అర్జెంటీనా ఎప్పుడూ ప్రపంచ కప్‌లో ప్రధాన ఆకర్షణగానే ఉంటుంది. అందుకే మాపై ఇలాంటి చర్చలు సహజం. ప్రతి జట్టుకు వ్యతిరేకంగా ఉండే అభిమానులు ఉంటారు. అదే విధంగా అర్జెంటీనా గెలవకూడదని కోరుకునే వారూ ఉంటారు' అని పేర్కొన్నాడు.

**-వీఏఆర్‌పై పూర్తి నమ్మకం**

'వీఏఆర్ ద్వారా ఎవరికైనా అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం చాలా కష్టం. టోర్నీ ప్రారంభానికి ముందు మాకు నిర్వహించిన సమావేశాల్లోనే నిబంధనలన్నింటినీ స్పష్టంగా వివరించారు. ఏ పరిస్థితిలో ఎలా నిర్ణయం తీసుకుంటారో వీడియోలతో చూపించారు. ప్రస్తుతం అదే నిబంధనలను అక్షరాలా అమలు చేస్తున్నారు' అని స్కలోని స్పష్టం చేశాడు. కాగా, స్విట్జర్లాండ్‌పై విజయం సాధిస్తే అర్జెంటీనా వరుసగా రెండో ప్రపంచ కప్ సెమీ ఫైనల్‌లోకి అడుగుపెడుతుంది. అయితే టోర్నీలో ఇప్పటివరకు ప్రపంచ టాప్-10



ర్యాంకింగ్ జట్టును ఎదుర్కోకుండానే క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకోవడం కూడా ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

## ఆ ఫొటోలు చూసి కోహ్లీ షాకైపోయాడు-ఇంగ్లండ్ బ్యాటర్ జార్డన్ కాక్స్

ఇంటర్నెట్ డెస్క్:

త్వరలో ఇంగ్లండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌లో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ పాలు పంచుకోనున్నాడు. జులై 14 నుంచి బర్మింగ్‌హామ్‌లో ఈ టోర్నీ జరగనుంది. ఇదిలా ఉంటే గత నెలలో ఇంగ్లండ్‌కు వెళ్లిన కోహ్లీ లండన్‌లో స్టార్ బ్యాటర్ జార్డన్ కాక్స్‌ను కలిశాడు. ఈ సందర్భంగా తమకు ఎదురైన ఒక షాకింగ్ అనుభవాన్ని జార్డన్ తాజాగా మీడియాతో పంచుకున్నాడు. ఈ సమావేశం గురించి మీడియాకు తెలియకుండా జాగ్రత్తలు తీసుకుందామని తాము అనుకున్నట్టు జార్డన్ తెలిపాడు. కానీ తమ ప్రయత్నాలు ఫలించకపోగా ఎవరో సీక్రెట్‌గా ఫొటోలు తీయడం కోహ్లీని షాక్‌కు గురిచేసిందని చెప్పాడు.కోహ్లీని ఇది చాలా షాక్‌కు గురి చేసింది. కోహ్లీని ఎవరో ఫాలో అవుతున్నట్టు అతడికి చిన్నపాటి అనుమానం కూడా రాకుండా ఫాలో అయ్యారు. అతడి పక్క నుంచి చాలా మంది వెళ్లారు. కానీ ఒక్కరు కూడా ఆగి కనీసం పలుకరించను కూడా లేదు. దీంతో, ఎవరూ తనను గమనించలేదని అనుకున్నాడు. రెండు గంటల తరువాత ఫొటోలు బయటకు వచ్చేసరికి షాక్ అయిపోయాడు. వెంటనే నాకు మెసేజ్ చేశాడు. ఈ ఫొటోలు ఎలా వచ్చాయి. వీటిని చూశావా? అని ప్రశ్నించాడు. అసలు ఈ ఫొటోలు ఎవరు తీశారో నాకూ ఏమీ అర్థం కాలేదు' అని జార్డన్ అప్పటి ఉదంతాన్ని గుర్తు చేసుకున్నాడు. జనాలు ఎల్లప్పుడూ అతణ్ని గమనిస్తూనే ఉంటారు. కానీ జనాల దృష్టికి దూరంగా సాధారణ జీవితాన్ని ఎంజాయ్ చేయాలని అతడికీ ఉంటుంది. దురదృష్ట వశాత్తూ ప్రతిసారీ అది సాధ్యం కాదు' అని చెప్పాడు. జార్డన్ కూడా విరాట్ కోహ్లీతో కలిసి ఆర్సీబీ తరఫున ఐపీఎల్‌లో పాల్గొన్న విషయం తెలిసిందే. 2026 ఐపీఎల్ సీజన్‌లో కోహ్లీ ఆర్సీబీ తరఫున 600 పైచిలుకు పరుగులు స్కోర్ చేసిన విషయం తెలిసిందే. ఆర్సీబీ ఐపీఎల్ టైటిల్‌ను కూడా సొంతం చేసుకుంది. ఆ తరువాత అఫ్గానిస్థాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌కు కోహ్లీ గాయం కారణంగా దూరం కావాల్సి వచ్చింది.



# స్పోర్ట్స్

## స్టోక్స్ రిటైర్మెంట్ వీడియోపై రచ్చ-ఈసీబీకి ఐసీసీ క్లీన్ చిట్!




ఇంటర్నెట్ డెస్క్:

ఇంగ్లండ్ టెస్ట్ జట్టు మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ రిటైర్మెంట్ ప్రకటనకు సంబంధించిన డ్రెస్సింగ్‌రూమ్ వీడియో వ్యవహారంపై ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోరు పై ఎలాంటి చర్యలూ తీసుకోబోమని ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ తెలిపింది. ఈ అంశంపై విచారణ చేపట్టిన అనంతరం తదుపరి చర్యలేవీ అవసరంలేదని నిర్ణయిస్తూ స్పష్టతనిచ్చింది.

**-ఇదీ జరిగింది..**

ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్ సందర్భంగా స్టోక్స్ తన అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు డ్రెస్సింగ్‌రూమ్‌లో సహచర ఆటగాళ్ల మధ్య ప్రకటించాడు. ఈ దృశ్యాలను మ్యాచ్ నాలుగో రోజు ఆట కొనసాగుతుండగానే సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది ఈసీబీ. ఆ సమయంలో స్టోక్స్ ఇంకా మ్యాచ్ ఆడుతూ ఉండటంతో ఈ వీడియోపై వివాదం చెలరేగింది. మ్యాచ్ పూర్తికాకముందే ఇలాంటి సన్నివేశాలను బహిర్గతం చేయడంపై ఈసీబీని ఐసీసీ వివరణ కోరింది. విచారణ అనంతరం ఈసీబీపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదని ఐసీసీ నిర్ణయించింది. అయితే.. ప్లేయర్స్ అండ్ మ్యాచ్ అఫీషియల్స్ ఏరియా(ామీాూ)లోని ఆర్టికల్ 2.2.11 నిబంధనల ప్రకారం. ప్రసార ప్రయోజనాల పేరిట డ్రెస్సింగ్‌రూమ్‌లో ఎలాంటి వీడియో కెమెరాలు, ఇతర రికార్డింగ్ టూల్స్‌ను అమర్చకూడదని స్పష్టం చేసింది. కాగా ఈసీబీ నుంచి ఐసీసీ వివరణ కోరినట్టు వార్తలు వెలువడిన సమయంలో బెన్ స్టోక్స్ 'ఖుఎని ప్తఅఎ...' అని సోషల్ మీడియా వేదికగా వ్యంగ్యంగా స్పందించడం చర్చనీయాంశమైంది. మూడో టెస్ట్ నాలుగో రోజు ఆట ప్రారంభానికి ముందు సహచర ఆటగాళ్లతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యాడు. ఆఖరి వరకు పూర్తి అంకితభావంతో ఆడాలని వారికి సూచించాడు. ఆ తర్వాత బౌలింగ్‌లో ఓ వికెట్ కూడా సాధించాడు. అయితే.. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 160 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను కివీస్ 2-1తో కైవసం చేసుకుంది.

# నా చివరి సినిమా కూడా ఇక్కడే
## ‘లెనిన్’ సక్సెస్ మీట్‌లో ఏడ్చేసిన భాగ్యశ్రీ బోర్సే

అక్కినేని అఖిల్ హీరోగా నటించిన ‘లెనిన్’ చిత్రం విజయవంతంగా ప్రదర్శింపబడుతున్న నేపథ్యంలో చిత్ర బృందం ఇవాళ సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హాజరైన హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. అభిమానులకు, చిత్ర బృందానికి కృతజ్ఞతలు తెలుపుతూ వేదికపైనే కన్నీళ్లు పెట్టుకున్నారు. తనను ఈ స్థాయికి తీసుకొచ్చింది అభిమానుల ప్రోత్సాహమేనని ఆమె ఉద్వేగంగా అన్నారు.ఈ సందర్భంగా భాగ్యశ్రీ మాట్లాడుతూ.. “ఈ రోజు నేను చాలా ఎమోషనల్‌గా ఉన్నాను. అందుకే నా మనసులో ఉన్నది మాట్లాడాలనుకుంటున్నాను. నేను ఈ రోజు ఇక్కడ ఉండటానికి కారణమైన వ్యక్తి, మా దర్శకుడు మురళి కిశోర్ గారికి ముందుగా ధన్యవాదాలు చెప్పాలి. మీరు నాకు ‘భారతి’ పాత్ర ఇవ్వకపోయి ఉంటే, ఈ రోజు నాకు ఇంతటి ప్రశంసలు దక్కేవి కావు. నా మీద నమ్మకం ఉంచి, నన్ను భారతిగా తెరపై నిలబెట్టినందుకు మీకు ఎప్పటికీ రుణపడి ఉంటాను” అని దర్శకుడికి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం హీరో అఖిల్ గురించి మాట్లాడుతూ.. “అఖిల్ నువ్వు ఎంత కష్టపడ్డావో పక్కనుండి నేను చూశాను. గత పదేళ్లుగా నీ ప్రయాణం నాకు తెలియకపోయినా, అనుకున్న ఫలితాలు రానప్పుడు ఎలా ఉంటుందో నేను ఊహించగలను. రక్తం, చెమట, కన్నీళ్లు చిందించి పనిచేశావు. సెట్‌లో ఒక్క క్షణం కూడా ఖాళీగా కూర్చోవడం నేను చూడలేదు. ప్రతిదీ సరిగ్గా జరగాలని తపించేవాడివి. నువ్వు ఇంతటి ప్రేమకు, విజయానికి అర్హుడివి. పదో తేదీన నీకు విజయం వస్తుందని చెప్పాను, అది వచ్చింది. అఖిల్, నువ్వు వచ్చేశావ్. నీతో కలిసి మళ్లీ నటించడానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. నువ్వొక అద్భుతమైన పెర్ఫార్మర్” అంటూ ప్రశంసించారు.చివరగా తన అభిమానుల గురించి మాట్లాడుతూ భాగ్యశ్రీ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. కన్నీళ్లను ఆపుకోలేక పోయారు. “గత ఏడాదిన్నరగా నా ప్రయాణంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నాను. నేను కిందపడిపోయిన ప్రతిసారీ, నా అభిమానులు పంపిన మెసేజ్‌లు, రీల్స్, వారు చూపిన నిరంతర ప్రోత్సాహమే నన్ను ఈ రోజు ఇక్కడ నిలబెట్టింది” అంటూ ఆమె కన్నీటి పర్యంతమయ్యారు.కొద్దిసేపటి తర్వాత తేరుకుని.. “నేనొకటే చెప్పాలనుకుంటున్నాను. హైదరాబాద్ నా కర్మభూమి. నా చివరి సినిమా కూడా ఇక్కడే చేయాలని కోరుకుంటున్నాను. అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు” అని తన ప్రసంగాన్ని ముగించారు.మురళి కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘లెనిన్’ చిత్రంలో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే ‘భారతి’ అనే పాత్రలో నటించారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి స్పందనతో దూసుకుపోతోంది. ఈ సినిమాకు నవీన్ కుమార్ సినిమాటోగ్రఫీ అందించగా, తమన్ సంగీతం సమకూర్చారు. నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరించారు.



# షమితా శెట్టి ఎండోమెట్రియోసిస్ బాధ
## డాక్టర్ సలహా విని షాక్!



బాలీవుడ్ నటి షమితా శెట్టి తన ఎండోమెట్రియోసిస్ అనుభవాన్ని ఓపెన్‌గా పంచుకుంటూ నెటిజన్లను ఆకట్టుకుంది. 2024 మేలో ఈ సమస్యకు శస్త్రచికిత్స చేయించుకున్న షమిత... సోహా అలీ ఖాన్ హోస్ట్ గా వ్యవహరించిన ‘ఆల్ అబౌట్ హర్’ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ఒక డాక్టర్ తనకు “ఓ బిడ్డను కను.. అదే ఎండోమెట్రియోసిస్‌కు నివారణి” అని సలహా ఇచ్చాడని షమిత చెప్పింది. దీనికి సమాధానంగా... “ఓకే. బేబీని పుట్టించేందుకు మనిషిని ఎక్కడి నుంచి తెచ్చుకోవాలి?” అని సరదాగా అడిగానని వెల్లడించింది. 47 ఏళ్ల షమిత ఇప్పటికీ అవివాహితగానే ఉన్న సంగతి తెలిసిందే.

**-ఎండోమెట్రియోసిస్ అంటే ఏమిటి?**

గర్భాశయం లైనింగ్ లాంటి కణజాలం గర్భాశయం వెలుపల పెరిగే దీర్ఘకాలిక సమస్య ఇది. తీవ్ర నొప్పి, ఇన్‌ఫ్లమేషన్, స్కార్ టిష్యూ ఏర్పడుతుంది. భారతదేశంలో సుమారు 40% మహిళలు ఈ సమస్యతో బాధపడుతున్నారని, చాలా మందికి దీని గురించి తెలియదని షమిత హెచ్చరించింది. డాక్టర్ నీటా వార్టీ మాట్లాడుతూ, గర్భం దాల్చడం వల్ల ఈస్ట్రోజెన్ లెవెల్స్ తగ్గి తాత్కాలిక ఉపశమనం కలగవచ్చని చెప్పారు. కానీ ఇది శాశ్వత పరిష్కారం కాదని నిపుణులు చెబుతున్నారు. ఎండోమెట్రియోసిస్ ఫెర్టిలిటీని కూడా ప్రభావితం చేస్తుందని, ఓవరీలపై చాక్లెట్ సిస్టులు ఏర్పడి గుడ్ల నాణ్యత తగ్గుతుందని డాక్టర్ వివరించారు. శరీరం ఇచ్చే సిగ్నల్స్‌ను మహిళలు వినాలని, నొప్పి ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని షమిత సలహా ఇచ్చింది.

# ‘జన నాయగన్’కు సెన్సార్ క్లియరెన్స్.. అధికారికంగా ప్రకటించిన విజయ్-అన్నీ కుదిరితే 24న రిలీజ్..?

తమిళనాడు ముఖ్యమంత్రి, స్టార్ హీరో విజయ్ నటించిన చివరి చిత్రం ‘జన నాయగన్’ ఎట్టకేలకు విడుదలకు సిద్ధమైంది. వాస్తవానికి ఈ ఏడాది సంక్రాంతికే ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామా, సెన్సార్ బోర్డుతో సుదీర్ఘ వివాదాలు, కోర్టు చుట్టూ తిరగడం వల్ల గత ఏడు నెలలుగా ల్యాబ్‌కే పరిమితమైపోయింది. అయితే ఈ అడ్డంకులన్నింటినీ అధిగమించి, ఎట్టకేలకు సెన్సార్ బోర్డు నుంచి ‘ఎ’ సర్టిఫికెట్ సాధించుకుంది. ఈ విషయాన్ని విజయ్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. కోలీవుడ్ వర్గాల ప్రకారం... ‘జన నాయగన్’ ఈ నెల 24న ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా భారీ ఎత్తున విడుదల కానుందని తెలుస్తోంది. ఈ చిత్రానికి హెచ్. వినోద్ దర్శకత్వం వహించగా, కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. విజయ్ సరసన పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, మమిత బైజు, బాబీ డియోల్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తెలుగులో బ్లాక్‌బస్టర్ అయిన ‘భగవంత్ కేసరి’ సినిమాకు ఈ చిత్రం రీమేక్ లేదా కొన్ని ముఖ్యమైన సీన్ల స్ఫూర్తితో తెరకెక్కినట్లు ఇండస్ట్రీలో గట్టి ప్రచారం సాగుతోంది. అయితే దీనిపై దర్శకుడు వినోద్ స్పందిస్తూ. ఇది పక్కా విజయ్ మార్క్ కమర్షియల్ చిత్రమని, థియేటర్లలో అభిమానులకు పూనకాలు తెప్పించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. విజయ్ రాజకీయాల్లోకి వెళ్లిన తర్వాత ముఖ్యమంత్రి హోదాలో విడుదలవుతున్న తొలి, చివరి సినిమా కావడంతో బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందోనని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



# ‘డోస్’ (అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ!

శుక్రవారం వచ్చిందనగానే ఓటీటీ లవర్స్ అంతా కూడా మలయాళం నుంచి ఏమైనా థ్రిల్లర్ సినిమాలు వచ్చాయేమోనని తప్పకుండా సెర్చ్ చేస్తారు. అందుకు కారణం ఈ జోనర్ నుంచి వచ్చే మలయాళ సినిమాలు ఒక రేంజ్ లో ఆకట్టుకుంటాయనే నమ్మకం. అలాంటి ఆడియన్స్ ఆసక్తికి తగినట్టుగానే ఈ శుక్రవారం ( జులై 10)వ తేదీన ఒక సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా పేరే ‘డోస్’. సైకలాజికల్ థ్రిల్లర్ జోనర్ లో రూపొందిన ఈ సినిమా, ‘అమెజాన్ ప్రైమ్’తో పాటు లైన్స్ గేట్ ప్లే .. ‘ఆహా’లోను అందుబాటులో ఉంది. ప్రకాశ్ (సిజూ విల్సన్) ఒక కార్పొరేట్ హాస్పిటల్లో డాక్టర్ గా పనిచేస్తుంటాడు. అతని భార్య దివ్య ( కృషా కురూప్) అనారోగ్యంతో బాధపడుతూ ఉంటుంది. ఆమె అంటే అతనికి చాలా ఇష్టం. అందువలన ఆమె కోసం హాస్పిటల్ కి అందుబాటులోనే అతను నివసిస్తూ ఉంటాడు. అదే హాస్పిటల్లో అరుంధతి (దృశ్య రఘునాథ్) పనిచేస్తూ ఉంటుంది. చాలా కేసులు ఆమెనే డీల్ చేస్తూ ఉంటుంది. ఆమె భర్త ‘పీటర్’ మీడియాలో వర్క్ చేస్తుంటాడు. గతంలో ప్రకాశ్ .. అరుంధతి ప్రేమించుకుంటారు. అయితే కొన్ని కారణాల వలన ఆమెను ప్రకాశ్ పెళ్లి చేసుకోలేకపోతాడు. గర్భవతి అయిన తనని వదిలేసి వెళ్లిన అతనిపై అరుంధతి కోపంగా ఉంటుంది. ఇద్దరూ మాట్లాడుకోపోయినప్పటికీ, ఒకే హాస్పిటల్లో పనిచేస్తుంటారు. అక్కడే జూనియర్ డాక్టర్ గా ‘నిఖిల్’ పనిచేస్తుంటాడు. ఆ హాస్పిటల్ కి ‘సీఈఓ’ గా ఉన్న గోపీనాథ్ ( జగదీశ్) కూతురు ‘అభిరామి’ని అతను ప్రేమిస్తూ ఉంటాడు. అయితే నిఖిల్ ధోరణి నచ్చని కారణంగా అభిరామి అతనికి దూరంగా ఉంటుంది. కొన్ని రోజులుగా ప్రకాశ్ చాలా డిప్రెషన్ లో ఉంటాడు. ఎందుకంటే తను టేకప్ చేసిన కేసులన్నీ ఫెయిల్ అవుతుంటాయి. పేషంట్లు ఒకరి తరువాత ఒకరిగా చనిపోతుంటారు. తనపై గల కోపంతో అరుంధతినే ఇలా చేస్తుందనే అనుమానం అతనికి కలుగుతుంది. ఫలితంగా ఈ కేసును పరిష్కరించడానికి పోలీస్ ఆఫీసర్ వివేక్ (అశ్విన్ కుమార్) రంగంలోకి దిగుతాడు. అతని ఇన్వెస్టిగేషన్ లో ఎలాంటి నిజాలు బయటపడతాయి? నేరస్థులు ఎవరు? అనేది మిగతా కథ.ఈ కథ చాలావరకూ హాస్పిటల్ చుట్టూ తిరుగుతుంది. హాస్పిటల్లోని రోగులు అనుమానాస్పదంగా చనిపోతుంటారు. ఆ మరణాలవెనుక ఎవరున్నారు? అందుకు గల కారణాలు ఎలాంటివి? ఏ కేసును పరిష్కరించడానికి రంగంలోకి దిగిన పోలీస్ ఆఫీసర్ వివేక్ ఎలాంటి సవాళ్లను ఎదుర్కోవలసి వస్తుంది? అనేది ఈ కథలోని ప్రధానమైన అంశం. మెడికల్ మాఫియా .. మెడికల్ థ్రిల్లర్ నేపథ్యంలో అడపాదడపా సినిమాలు వస్తూనే ఉన్నాయి. ఒక మెడిసిన్ ను టెస్ట్ చేయడం కోసం .. హాస్పిటల్ కి వచ్చిన అమాయక కుటుంబాలను టార్గెట్ చేయడం వంటి కథలు గతంలో వచ్చాయి. అయితే అందుకు భిన్నమైన ఒక కథతో రూపొందినదిగా ‘డోస్’ కనిపిస్తుంది. ఇద్దరు డాక్టర్ల మధ్య ప్రేమ వ్యవహారం, వారి వృత్తిపై ఎలాంటి ప్రభావం చూపించిందనేది ఈ కథలోని సారాంశం. ఈ కథ మొదలైన మొదటి అరగంట వరకూ, ఏం జరుగుతుందనేది మనకి అర్థం కాదు. ఆ తరువాతనే ఒక్కో విషయం ప్రేక్షకులకు అర్థమవుతూ ఉంటుంది. హీరో అనుమానాలు .. అన్వేషణలతో ఫస్టు పార్టు, అందుకు సంబంధించిన పోలీస్ ఆఫీసర్ ఇన్వెస్టిగేషన్ తో సెకండ్ పార్టు సాగుతాయి. ఆడియన్స్ కూడా తమకి తెలియకుండానే ఇన్వెస్టిగేట్ చేయడం మొదలుపెడతారు. వాళ్ల సందేహాలు నర్సులు .. జూనియర్ డాక్టర్ల చుట్టూ తిరుగుతూ ఉంటాయి.ఇలాంటి కథలలో నేరస్థులు ఎవరనేది ఎలాంటి పరిస్థితులలో ఆడియన్స్ గెస్ చేయకూడదు. గెస్ చేశారంటే




ఆ కథ .. స్క్రీన్ ప్లే చాలా బలహీనంగా అల్లుకోవడం జరిగిందని అర్థం చేసుకోవాలి. ఈ కథలో కూడా కొన్ని పాత్రలపైకి అనుమానాలు వెళతాయి. అయితే కావాలని ఆడియన్స్ దృష్టిని అటు వైపు తీసుకెళ్లినట్టుగా అనిపించదు. ఆ తతంగం చాలా సహజంగా జరిగిపోతుంది. ఇక అసలైన నేరస్థులు ఎవరనేది కూడా దర్శకుడు చెప్పేంత వరకూ చాలామంది కనుక్కోలేరు.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037, Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449